Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 16.06.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 02 పేజీలు : 12, వెల : ₹ 5

కేర్
డా॥ ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి M.D.S.
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల
పొగతోట, నెల్లూరు ✆ 9247004747
ఉచిత (క్యాష్‌లెస్) దంత వైద్యసేవలు
• రాష్ట్ర పోలీస్ ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత
• రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు EHS (ఎంప్లాయిస్ హెల్త్ స్కీము)

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# దివికేగిన కవి దిగ్గజం



అలసిసొలసిన ఓ మధురగీతం ఆదమరచి నిదురపోయిన వేళ.. చీకటిమాటున ఏదో సవ్వడి. ఏమిటా అని చూస్తే...తలవాకిట వద్ద తచ్చాడుతున్న మృత్యువు. సాక్షాత్తూ మృత్యువే వచ్చి ఎదురుగా నిలబడడంతో కవిహృదయం స్పందించిది. 'ఓహ్ నువ్వా!.. రావమ్మా రా'!.. అంటూ చిరునవ్వుతోనే సాదరంగా లోపలికి ఆహ్వానించింది. అంతేకాదు, మృత్యువుకు పాలుపట్టి ప్రేమగా జోల కూడా పాడింది. చిత్రం!.. మృత్యువు కరకు రాతిగుండె కరిగి కరిగి కన్నీటి కాలువైంది. ఆ కవిహృదయమే...ఏడవకుమని మృత్యువును ఊరడించింది. మృత్యువు తెచ్చిన పూలపల్లకీని సగర్వంగా ఎక్కి గగనవీధుల వెంట గంభీరంగా కదిలి పోయింది. అయినా!.. కాలానికి కనికరం లేదు..కలాన్ని కూడా పట్టుకుపోయింది. తెల్లవారేసరికి ఆ మధురగీతమే..ఆ ఇంటి వాకిట్లో వాలిన పత్రికలో పతాకశీర్షికగా మెరిసింది. తెలుగు పదాలకు పట్టాభిషేకం చేసిన ముద్దుబిడ్డ సినారె.. ఇక లేరనే బాధతో తెలుగుతల్లి తల్లడిల్లింది. ఈ శోకం..ఈ విషాదగీతంతో చెమ్మగిల్లిన తెలుగుజాతి... సినారెని ఆప్యాయంగా తన గుండెల్లో నిలుపుకుంది.

(మిగతా 11వ పేజీలో)



## లాయర్ కుటుంబంతో సినారెకు చిరకాల అనుబంధం 3లో

# పొత్తు కోసం ఎత్తులు

- ఎన్డీఏతో చెలిమికి వైసిపి ఆరాటం
- పొత్తును నిలుపుకోవడానికి టీడీపీ పోరాటం
- బీజేపీతో బంధానికి కేసులే కారణం



సంకీర్ణ ప్రభుత్వాల యుగంలో జాతీయ రాజకీయాలలోనూ ప్రాంతీయ పార్టీల పాత్ర చాలా కీలకంగా మారింది. కేంద్రంలో ప్రభుత్వం మనుగడ సాగించాలంటే ప్రాంతీయ పార్టీలే పునాదులుగా నిలబడ్డ పరిస్థితిని చూసాం. నాలుగు సీట్లున్న ప్రాంతీయ పార్టీలు కూడా కేంద్రంలో ప్రభుత్వాలను పడగొట్టడం చూసాం. ప్రధాని పీఠంపై వున్న నాయకులు కూడా తమ కుర్చీలు కాపాడుకోవడానికి ప్రాంతీయ పార్టీల అధినేతల కాళ్ళూ, గడ్డాలు పట్టుకుని బ్రతిమలాడడం చూసాం. నిన్న మొన్నటి వరకు దేశ రాజకీయాలలో కనిపించిన పరిస్థితి ఇది.

కాని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అందుకు పూర్తి భిన్నమైన రాజకీయ వాతావరణం కనిపిస్తోంది. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నాయంటే ప్రాంతీయ పార్టీలను తమ కూటమిలో చేర్చుకోవడానికి జాతీయ పార్టీలు ఆరాటపడాలి. మన రాష్ట్రంలో మాత్రం అందుకు భిన్నంగా వుంది. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీతో పొత్తు కలుపుకునేందుకు ఒకరు, ఉన్న పొత్తును నిలుపుకునేందుకు మరొకరు తపన పడుతుండడమే ఆశ్చర్యం కలిగిస్తోంది.

(మిగతా 11వ పేజీలో)

• నంద్యాల

# 'దేశం'కు అగ్నిపరీక్ష!



## వైకాపాలో చేరిన శిల్పా

సాధారణ ఎన్నికల కంటే ఒక ట్రెండు సంవత్సరాల ముందు వచ్చే ఉపఎన్నిక ఏదయినా అధికారంలో వున్న పార్టీకి అగ్ని పరీక్ష వంటిదే! రాష్ట్రంలో ఆయా పార్టీల స్థితిగతులు బయటపడేది కూడా ఉపఎన్నికల ద్వారానే! అధికార పార్టీకి ప్రజాదరణ పెరిగిందా, కోల్పోయిందా అన్నది కూడా ఉపఎన్నికల ఫలితాలలో తేటతెల్లం అవుతుంటుంది.

రాష్ట్రంలో ఏ పార్టీ పరిస్థితి ఏంటి, భవిష్యత్ రాజకీయాలు ఏ విధంగా ఉండబోతున్నాయన్నదానికి కొలమానంగా నంద్యాల ఉపఎన్నిక వచ్చి పడింది. భూమా నాగిరెడ్డి మరణంతో కర్నూలు జిల్లాలోని నంద్యాల అసెంబ్లీ సీటుకు ఉపఎన్నిక వచ్చింది. బహుశా కొద్ది రోజుల్లోనే దీనికి నోటిఫికేషన్ వెలువడవచ్చు.

మన రాష్ట్రంలో ఒక సాంప్రదాయాన్ని ప్రధానపార్టీలు కొనసాగిస్తున్నాయి. ఎమ్మెల్యే గాని, ఎంపీగాని మరణిస్తే ఆ స్థానానికి జరిగే ఉపఎన్నికల్లో సంబంధిత కుటుంబసభ్యులు పోటీ చేస్తే అవతల పార్టీ అభ్యర్థిని పెట్టకుండా ఏకగ్రీవ ఎన్నికకు సహకరిస్తూ వచ్చేది. కాని నంద్యాల సబ్జెక్ట్ వేరే! 2014లో భూమా నాగిరెడ్డి ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు. తర్వాత తెలుగుదేశంలో దూరారు. ఆ పార్టీ ఎమ్మెల్యేగానే మరణించారు. ఇక్కడ కొత్త సమస్య ఏంటంటే

(మిగతా 11వ పేజీలో)

గ్రేట్ ఆడి & రంజాన్
డబుల్ సెలబ్రేషన్స్
FLAT 50% OFF FLAT 30% OFF FLAT 20% OFF
ఫ్యాన్సీ, డిజైనర్ శారీస్, సల్వార్స్, డ్రస్ మెటీరియల్స్, ఫ్యాన్సీ పావడాస్, లేడీస్ వెస్ట్రన్‌వేర్, సూటింగ్స్ & షర్టింగ్స్, కిడ్స్‌వేర్, బ్రాండెడ్ మెన్స్‌వేర్‌పై..
*పట్టు చీరలు వీవర్స్ ధరలకే...
T&C Apply
నేడే కొనండి.. తర్వాత చెల్లించండి..!

• 5 వేల రుపాయలు కోనుగోలుపై
• వడ్డీ 0% • EMI 6 నెలలు
ఈ ఆఫర్ అన్నింటిపై..
kotak Kotak Mahindra Bank, AXIS BANK, HDFC BANK, ICICI Bank, RBL BANK, SBI Card, IndusInd Bank, HSBC, Standard Chartered, Union Bank of India
ఈ క్రెడిట్ కార్డుల్లో ఏదైనా సరే...
కళానికేతన్ షాపింగ్ మాల్
ట్రంక్ రోడ్, గాంధీనగర్, నెల్లూరు. ఫోన్ 2316677
contact@eyecatch.co.in

# ముగిసిన వెంగమాంబ తిరునాళ్ళు



నెల్లూరుజిల్లా దుత్తలూరు మండలం నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఈ నెల 11వ తేదీన మొదలై 15వ తేదీతో ముగిసాయి. 11వ తేదీ నిలుపు కార్యక్రమం జరిగింది. 12, 13తేదీలలో అమ్మవారి గ్రామోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా 14వ తేదీ బుధవారం వెంగమాంబ, గురవయ్య దంపతుల కళ్యాణం నేత్రపర్వంగా జరిగింది. లోక కళ్యాణార్థం వేదపండితుల వేదమంత్రోచ్ఛారణలతో, మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని నిర్వహించారు. తొలుత వడ్డిపాళెం వెంగమాంబ పుట్టినిల్లు నుంచి పచ్చవ వంశీయులు తెచ్చిన పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమకు దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వెంగమాంబ, గురవయ్య దంపతుల ఉత్సవ విగ్రహాలను అలంకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపైన ప్రతిష్టించారు. హిందూ ధర్మశాస్త్ర ప్రముఖులు వివాహ ప్రాశస్త్యం, వెంగమాంబ కళ్యాణ విశిష్టతను వివరించారు. కళ్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించి ఆనంద పారవశ్యులయ్యారు. ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు కుటుంబసభ్యులతో కలిసి కళ్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వెంగమాంబ గురవయ్యలను పల్లకిలో ఉంచి దేవస్థానం చుట్టూ ప్రదక్షిణం జరిపి ఊరేగించారు. 15వ తేదీ భక్తులు పొంగళ్ళు పెట్టి దేవస్థానం చుట్టూ బండ్లు తిప్పారు. అలాగే ఎడ్లచే బండలాగుడు పందేలను అత్యంత కోలాహలంగా నిర్వహించారు. ఈ అయిదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలకు నెల్లూరుజిల్లా నుండే కాకుండా, వివిధ జిల్లాలు, రాష్ట్రాల్లో స్థిరపడ్డ ఉదయగిరి ప్రాంత వాసులందరూ పెద్దఎత్తున రావడం విశేషం. దేవాదాయశాఖ ఏసి వేగూరు రవీంద్రరెడ్డి, ఈఓ వెంకటేశ్వర్లు, వ్యవస్థాపక ధర్మకర్తల మండలి ఛైర్మెన్ పచ్చవ వెంగయ్య బ్రహ్మోత్సవాలను పర్యవేక్షించారు.



# ఇప్పుడైనా సరే.. ఎప్పుడైనా సరే... బస్తీమే సవాల్!

## సోమిరెడ్డిని రెచ్చగొడుతున్న కాకాణి

గతంలో ఇద్దరం కీలకపదవుల్లో పని చేశాం... ఇప్పుడూ పని చేస్తున్నాం... వేదికలపై, స్టేజీలపై ఆరోపణలు, ప్రత్యారోపణలు, సవాళ్ళు వద్దు... ఇద్దరం ఒక చోట కలుద్దాం... జడ్పీ ఛైర్మెన్‌గా, ఎమ్మెల్యేగా నేను, మంత్రిగా నీవు నెల్లూరు జిల్లాలో ఎవరు ఎంత మాత్రం అభివృద్ధి పనులు చేసారో, ఎవరు అవినీతికి పాల్పడ్డారో ప్రజల మధ్య బహిరంగంగా తేల్చుకుందాం... రా... ఇప్పుడైనా సరే... ఎప్పుడైనా సరే... మంత్రిగా ఇప్పుడు నీవు బిజీగా వుంటే నీవు చెప్పిన సమయానికి ఎక్కడికైనా వస్తానంటూ వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డికి సవాల్ విసిరాడు. ఆదివారం నెల్లూరుజిల్లా వెంకటాచలం మండల పరిషత్ సమావేశ మందిరంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా టిడిపి హయాంలోనే అభివృద్ధి జరిగిందని, మంత్రిగా ఉండి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించానని సోమిరెడ్డి చెప్పడం విడ్డూరంగా వుందని విమర్శించాడు. మండల కన్వీనర్ చెంచు కృష్ణయ్య, జడ్పీటీసీ సభ్యులు వెంకట శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో ఇద్దరు ఏ.ఇలు



నాణ్యతను పరిశీలించి పనులు సక్రమంగా చేయించాల్సిన ఇద్దరు క్వాలిటీ కంట్రోల్ ఏ.ఇలు ఏసిబి వలకు చిక్కిపోయారు. నీరు–చెట్టు పనులకు సంబంధించిన ఎం.బుక్ పరిశీలనకు ఓ కాంట్రాక్టర్ వద్ద 48వేల రూపాయలు డిమాండ్ చేయడం, ఆ డబ్బును లంచంగా తీసుకుంటూ వుండడంతో వల పన్ని ఏసిబ అధికారులు వారి ఆట కట్టించారు. ఈ సంఘటన నెల్లూరులోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో బుధవారం జరిగింది. కాంట్రాక్టర్లు తాము అడిగిన నగదు ఇవ్వకుంటే ఎం.బుక్ పరిశీలన జరగదని, నాణ్యతా విభాగం ధృవపత్రం ఇచ్చేది కుదరదని ఆ ఏ.ఇలు తెగేసి చెప్పేవారని, తాము అంత నగదు ఇవ్వలేమని కాంట్రాక్టర్లు వేడుకున్నా మార్పు లేకపోవడంతో, విసిగిపోయిన ఓ కాంట్రాక్టర్ ఏసిబిని ఆశ్రయించడంతో ఏసిబి అధికారులు రంగంలోకి దిగి ఆ ఇద్దరు ఏ.ఇలను అదుపులోకి తీసుకున్నారు. తొలుత, ఏ.ఇ గిరిధర్‌రాజా లంచం తీసుకుంటుండగా వలవేసి ఏసిబి అధికారులు పట్టుకున్నారు. ఆ తర్వాత ఆయనకు సహకరిస్తున్న మరో ఏ.ఇ చంద్రమౌళిని పిలిపించి అదుపులోకి తీసుకున్నారు. ఏసిబి డిఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శివకుమార్‌రెడ్డి, శ్రీహరిబాబు, వారి సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు. ఈ కేసులో డిఇల పాత్ర కూడా ఏమైనా ఉందా అని ఏసిబి అధికారులు ఆరా తీస్తున్నట్లు కూడా సమాచారం. ఏదేమైనా, ఈ ఏసిబి దాడులు నీటిపారుదలశాఖలో కలవరం పుట్టిస్తున్నాయి.

## ప్రభుత్వాసుపత్రిలో జడ్జి తనిఖీలు

నెల్లూరు దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాసుపత్రిలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సుధ మంగళవారం తనిఖీలు చేపట్టారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశాల మేరకు జడ్జి సుధ మానసిక దివ్యాంగులకు అందుతున్న వైద్యసేవలను గురించి తనిఖీ చేశారు. వీరి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదులు, మందులు, డాక్టర్ల గురించి ఆరా తీసారు. వైద్యం అందుతున్న తీరును పరిశీలించారు. లోపాలు ఉంటే తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాధాకృష్ణరాజు, ఆస్పత్రి అభివృద్ధి కమిటి డైరెక్టర్ బి.వి.లక్ష్మి, ఆస్పత్రి అడ్మిన్ డాక్టర్ కళారాణి, డాక్టర్లు లక్ష్మీప్రసన్న, పద్మావతి, ఐఎం మిశ్రా పాల్గొన్నారు.

## నిత్యాన్నదానానికి లక్ష విరాళం

నెల్లూరుజిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరశింహ స్వామి నిత్య అన్నదాన పథకానికి నెల్లూరు మాగుంట లేఅవుట్‌కు చెందిన బోయపాటి వెంకటరమణయ్య నాయుడు, శాంతమ్మ దంపతులు రూ.లక్ష విరాళంగా చెక్కును దేవస్థానం అధికారి శ్రీధర్‌నాయుడుకు సోమవారం అందజేశారు.

## ఇరిగేషన్ పనులపై...

# సిబిసిఐడి విచారణ జరిపించాలి

నెల్లూరుజిల్లా కోవూరు నియోజకవర్గంలో జరిగిన ఇరిగేషన్ పనులపై సిబిసిఐడి విచారణ జరిపించాలని వైయస్సార్సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కోవూరులోని రుక్మిణీ కళ్యాణ మండపంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గ పేరును ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి భ్రష్టు పట్టించారన్నారు. ఇరిగేషన్ పనుల్లో అవినీతి జరుగుతున్నా జిల్లా కలెక్టర్ దృష్టి పెట్టకపోవడం బాధాకరమని వెంటనే పట్టించుకోవాలని కోరారు. ఇరిగేషన్ అధికారులు సంతకాలు చేస్తే రాబోయే రోజుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దొంగ బిల్లులు పెట్టి లక్షలాది రూపాయలను కొల్లగొడితే వైయస్సార్సీపీ చూస్తూ ఊరుకోదన్నారు. కొడవలూరు మండలం కొత్తవంగల్లులో వంద కల్వర్టులు మంజూరు చేయడం దారుణమన్నారు. విడవలూరు మండలంలో గాదెలదిన్నెలో రైతులందరూ ఒక చోట కల్వర్టు కట్టమంటే టిడిపి నాయకుడి పొలం దగ్గర కల్వర్టు కట్టడం జరుగుతోందన్నారు. నిరంజన్‌బాబురెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, శివుని నరశింహులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కావలి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటి ఛైర్మెన్ రాజీనామా

కావలి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటి ఛైర్మెన్ పదవికి టిడిపికి చెందిన కండ్లగుంట మధుబాబునాయుడు బుధవారం రాజీనామా చేసారు. నెల్లూరు దర్గామిట్టలోని సోమశిల ప్రాజెక్ట్ కార్యాలయంలో ఈఈ రామచంద్రగుప్తకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశిల ప్రాజెక్టు మొట్టమొదటి ఛైర్మెన్‌గా ఎన్నికైన తాను టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీద మస్తాన్‌రావు ఏకపక్ష ధోరణితో తీవ్ర మనస్థాపానికి గురయ్యానన్నారు. కావలి మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్‌గా ఒక రైతు నాయకుడికి అవకాశం ఇవ్వకుండా రైతు నాయకులకు సంబంధంలేని వ్యక్తికి ఛైర్మెన్ పదవిని కట్టబెట్టడంతో రైతులు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారన్నారు. కావలిలో రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని భరించలేక రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు.

## నిరుపేద కుటుంబానికి...

# సంయుక్త సేవాసంస్థ వితరణ



నెల్లూరుజిల్లా కావలిలోని సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ కావలి వెంగళరావునగర్‌లో నివాసం ఉంటున్న షేక్ మస్తాన్‌వలికి, తుఫాన్ నగర్‌లో ఉంటున్న షేక్ రియాజ్, అన్వర్‌జాన్‌లు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా దాత షేక్ రియాజ్ మాట్లాడుతూ నిరుపేద అయిన షేక్ మస్తాన్‌వలి గత 9సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతున్నాడని, ఆయన పెద్దకుమార్తె మున్నీ పుట్టుకతోనే అంధురాలిగా జన్మించడంతో ఆ కుటుంబం జీవనం కష్టంగా మారిందన్నారు. ఈ విషయాన్ని సంయుక్త సేవాసంస్థ నిర్వాహకులు సురేంద్ర తెలియజేయడంతో ఆ కుటుంబానికి చేయూతనివ్వడం జరిగిందన్నారు. షేక్ అమీన్, షేక్‌బాబు, షేక్ మస్తాన్, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# చెంగాళమ్మ సేవలో జిల్లా జడ్జి

నెల్లూరు జిల్లా జడ్జి మౌలానా జునైద్ అహ్మద్ మంగళవారం నెల్లూరుజిల్లా సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి ఛైర్మెన్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్లురెడ్డి, ఇఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి జడ్జికి స్వాగతం పలికారు. అనంతరం ఆయనను ఆలయ మర్యాదలతో సత్కరించారు. అమ్మవారికి జడ్జి విశేషపూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. పాలకమండలి సభ్యులు ఆకుతోట రమేష్, మీజూరు రామకృష్ణ పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.22లక్షలు

నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపును మంగళవారం దేవాదాయశాఖ అధికారులు చేపట్టారు. 75రోజుల పాటు భక్తులు అమ్మవారికి హుండీ ద్వారా కానుకలు రూపేణా రూ.22,59,989లు సమర్పించినట్లు దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభిరెడ్డి, మారంరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

# లాయర్ కుటుంబంతో సినారెకు చిరకాల అనుబంధం





'లాయర్' కుటుంబంతో డా॥ సి.నారాయణరెడ్డి గారికి చిరకాల అనుబంధం ఉంది. దాదాపు 60యేళ్ళ నాటి ఆ బంధంతోనే ఆయన పలుసార్లు సూచనలు, సలహాలు ఇచ్చి 'లాయర్'ను ఆశీర్వదించేవారు. 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు సినీరంగంలో వున్నప్పటి నుండే డా॥ నారాయణరెడ్డి గారితో స్నేహ బాంధవ్యాలు ముడిపడ్డాయి. 'లాయర్' పత్రిక స్థాపించిన తరువాత కూడా నారాయణరెడ్డి గారితో తరచూ సంప్రదిస్తూ సలహాలూ సూచనలూ



తీసుకునేవారు. 1995లో రాజగోపాలరెడ్డి పరమపదించిన అనంతరం 'లాయర్' పత్రిక ప్రస్తుత నిర్వాహకుడు శివప్రభాత్‌రెడ్డితో పాటు అప్పటి అసోసియేట్ ఎడిటర్ సత్యవేటి శ్రీకాంత్ కూడా పలుమార్లు సినారెతో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపి ఆయన మార్గదర్శకంలో పలు వ్యాసాలను 'లాయర్'లో ప్రచురింపజేసారు.

1998 నవంబర్ 8న జరిగిన 3వ తుంగా పండుగలో సినీరంగం నుండి నటశేఖర కృష్ణ, రాజకీయ రంగం నుండి జె.కె.రెడ్డి, సాహిత్య రంగం నుండి సి.నారాయణరెడ్డి గారలు తుంగా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అప్పటికే పరమపదించిన సత్యవేటి శ్రీకాంత్ కుటుంబానికి 'లాయర్' పత్రిక పక్షాన 75వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సత్యవేటి శ్రీమతికి అందజేయడంతో పాటు, తుంగా రాజగోపాలరెడ్డి గారితోనూ, తదనంతరం సత్యవేటి, శివప్రభాత్‌రెడ్డిలతో తనకున్న సాన్నిహిత్యాన్ని సభకు తెలియజేసారు డా॥ సి.నారాయణరెడ్డి గారు. ఆయన లేని లోటు 'లాయర్'కి సైతం తీర్చలేనిది. 'లాయర్' అభివృద్ధికి ఎన్నో పర్యాయాలు ఆశీస్సులందించిన ఆ మహామనీషికి, సాహితీయోధునికి నివాళులర్పిస్తోంది 'లాయర్'.

# తీరంకు సిఇజడ్ హారం

- ఉపాధి కేంద్రంగా నెల్లూరుజిల్లా
- భారీ పరిశ్రమల ద్వారా ఉద్యోగాలు
- పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపు



డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి పాలనలో జిల్లాలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెట్టింది. కృష్ణపట్నం పోర్టు అత్యంత వేగంగా నిర్మాణం పూర్తి చేసుకుంది. వై.యస్. అనే నాయకుడు మరణించకపోయి వుంటే కృష్ణపట్నం పోర్టు ఈరోజు దేశంలోనే ప్రముఖ పారిశ్రామిక హబ్‌గా అవతరించి ఉండేది. ఆయన మరణం జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి బ్రేకులు వేసింది.

అయితే చాలా ఏళ్ల తర్వాత జిల్లా పారిశ్రామిక ప్రగతికి సంబంధించి ఓ శుభవార్త వెలువడింది. కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తీరప్రాంత ఉపాధి ప్రాంతం(కోస్టల్ ఎంప్లాయిమెంట్ జోన్-సిఇజడ్)ను నెల్లూరుజిల్లాలో ఏర్పాటు చేయాలని దాదాపు నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. దీనికి సంబంధించి ప్రాథమిక పరిశీలన కూడా పూర్తయ్యింది.

నీతి అయోగ్ సిఇఓ అమితాబ్‌కాంత్ ఇటీవలే కృష్ణపట్నం పోర్టును సందర్శించారు. పోర్టులో వున్న వసతులను, వేగవంతంగా జరుగుతున్న ఎగుమతులు, దిగుమతులను పరిశీలించారు. పోర్టు పరిధిలో సేకరించిన భూముల వివరాలు తెలుసుకున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు, వాటి ద్వారా పెద్దసంఖ్యలో ఉద్యోగాలు కల్పించడానికి ఇది ఒక పెద్ద సెంటర్‌గా చేయొచ్చని ఆయన గుర్తించారు. కృష్ణపట్నం పోర్టును ప్రధాని నరేంద్రమోడీ కలల రూపంగా భావించిన ఆయన ఈ పోర్టు విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తీసుకున్న చొరవతోనే ఈ నెల 12వ తేదీన నీతి అయోగ్ కమిటీ సభ్యులు సంజయ్‌గుప్తా, యుదువీర్ మాతూర్, సుధీర్‌కుమార్, అతిషాకుమార్‌లతో కూడిన బృందం కృష్ణపట్నం పోర్టును సందర్శించింది. వీరితో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ సిద్ధార్థజైన్, ఏపిఐఐసి ఛైర్మెన్ పి.కృష్ణయ్య, మేనేజింగ్ డైరెక్టర్ ఎ.బాబు, నెల్లూరు, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు ముత్యాలరాజు, ప్రద్యుమ్న, ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మి, పోర్టు సిఇఓ ఎండ్లూరి అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు. కృష్ణపట్నం వద్ద సిఇజడ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, మౌలిక సదుపాయాలను గురించి పోర్టు అధికారులు, జిల్లా అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నీతి అయోగ్ కమిటీకి వివరించారు. ఈ వివరాల పట్ల కమిటీ సంతృప్తి చెందింది. కృష్ణపట్నం పోర్టు కేంద్రంగా జిల్లా తీరప్రాంతంలో కనీసం 50చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సిఇజడ్‌ను ఏర్పాటు చేయాల్సి వుంటుంది. సిఇజడ్ ప్రధానలక్ష్యం ఒక్కో పరిశ్రమ ద్వారా 10వేల నుండి 40వేల మంది వరకు ఉద్యోగాలను కల్పించడం. కేంద్ర ప్రభుత్వం మేకిన్ ఇండియా పాలసీ ద్వారా భారీ పరిశ్రమలను ఇక్కడ పెట్టించాలని భావిస్తోంది. ముఖ్యంగా కృష్ణపట్నంపోర్టు ఉండడంతో వివిధ దేశాల నుండి ముడి సరుకులను దిగుమతి చేసుకుని వాటి ద్వారా వస్తువులు తయారు చేసి తిరిగి విదేశాలకు ఎగుమతి చేసే మాన్యూఫాక్చరింగ్ యూనిట్‌లకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ పరిశ్రమల ద్వారా ఎగుమతులు, దిగుమతులు పెరగడంతో పాటు విదేశీ వస్తువుల దిగుమతులను తగ్గించుకోవచ్చు. తద్వారా విదేశీ మారక ద్రవ్య నిల్వలను పెంచుకోవడంతో పాటు వస్తువుల ఎగుమతి ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఇంకా ఆర్జించే అవకాశముంటుంది. అంతేకాదు పరిశ్రమలు పెరిగే కొద్ది ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఈ సిఇజడ్‌లో పరిశ్రమలను స్థాపించాలనుకునే వారిని కూడా కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహించే అవకాశం వుంది.

సిఇజడ్ వస్తే జిల్లాలోని అన్ని ప్రధాన రహదారులను కూడా ఇతర జిల్లాల నుండి రవాణాను మెరుగుపరిచే దిశగా రహదారులను అభివృద్ధి చేయవచ్చు. సిఇజడ్ పై కేంద్రం నుండి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది.

## తొలిచూపులోనే జరిగింది...

- **నుడాకు రూ.10కోట్లు**

నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10కోట్లు నిధులను విడుదల చేసింది. ఈ నిధులను నుడా కార్యాలయం, మౌలిక వసతుల కల్పనకు వినియోగించనున్నారు. నుడా కార్యదర్శిగా భాగ్యలక్ష్మిని నియమిస్తూ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి కరికాల్ వలవన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ప్రస్తుతం తిరుపతి కార్పొరేషన్‌లో డిప్యూటి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఆమె నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటి కమిషనర్‌గా కూడా పని చేసివుండడం విశేషం!

## శ్రీనివాసులురెడ్డి సేవలు..

# భావితరాలకు మార్గదర్శకం

### - వక్తల ప్రశంస



న్యాయసేవలను సామాన్య ప్రజలకు చేరువ చేయడంలో ఎంతో సమర్ధవంతంగా కృషి చేసిన ఏపీ ప్రాసిక్యూషన్స్ అడిషనల్ డైరెక్టర్ టి.శ్రీనివాసులురెడ్డి సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని.. భావితరాలకు మార్గదర్శకమని పలువురు వక్తలు శ్రీనివాసులురెడ్డి సేవలను కొనియాడారు. న్యాయసేవలు అందించడంలో నిబద్ధతతో వుంటూ, ఎంతోమందికి ఆయన స్ఫూర్తిప్రదాతగా నిలిచారని వారు ప్రశంసించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా పనిచేస్తూ ఇటీవల పదవీ విరమణ చేసిన టి. శ్రీనివాసులురెడ్డికి నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌లో ఎంతోమంది ఆత్మీయులు, అభిమానుల మధ్య వీడ్కోలు సభ నిర్వహించారు. అమరావతి పబ్లిక్ ప్రాసిక్యూర్స్ (క్యాడర్) అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ వీడ్కోలు-సత్కార సభ ఎంతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (గ్రేడ్-1), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్స్(క్యాడర్) అసోసియేషన్ - అమరావతి అధ్యక్షులైన పి.శేషయ్య మాట్లాడుతూ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సంక్షేమం కోసం శ్రీనివాసులురెడ్డి అవిశ్రాంతంగా కృషిచేశారన్నారు. ఆయన సేవలు సదా చిరస్మరణీయమన్నారు. అనంతరం, ఆర్గనైజింగ్ కమిటీ జనరల్ సెక్రటరీ ఎస్ఆర్ఏ రోజ్‌దార్ మాట్లాడుతూ, శ్రీనివాసులురెడ్డి తన ప్రస్థానాన్ని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్థాయి నుంచి అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ స్థాయికి ఎదిగారని, ఆయన ఎక్సైజ్ కోర్టులో పనిచేసినా, ఏసిబి కోర్టులో పనిచేసినా, పోలీసుశాఖలో బాధ్యతలు చేపట్టినా ఎంతో క్రమశిక్షణతో, సేవాభావంతో..ఎంతో బాధ్యతతో పనిచేశారని ప్రశంసించారు. ఆయన పనితీరు ఎంతో మెచ్చుకోదగిందని, ఆయన అందరికీ మార్గదర్శకులని అన్నారు. కావలికి చెందిన ప్రముఖ వ్యాఖ్యాత అన్నదాత మణి మాట్లాడుతూ, శ్రీనివాసులురెడ్డి న్యాయసేవా నిరతిని ఎంతగానో కొనియాడారు. శ్రీనివాసులురెడ్డి తన జీవితంలో ఎంత కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకున్నారో వివరించి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం, టి.శ్రీనివాసులురెడ్డి దంపతులను రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి విచ్చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జిల్లావ్యాప్తంగా వున్న శ్రీనివాసులురెడ్డి మిత్రులు, సన్నిహితులు అందరూ కలసి ఎంతో ఆత్మీయంగా ఘనంగా సత్కరించారు. తనకు జరిగిన ఘనసన్మానానికి శ్రీనివాసులురెడ్డి అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, మిగిలిన జీవితంలో కూడా తాను పబ్లిక్ ప్రాసిక్యూటర్ల కోసం, ప్రజా సంక్షేమం కోసం ఎల్లవేళలా పాటుపడతానని అందరి కరతాళధ్వనుల మధ్య అన్నారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుశీల గోపాల్ (విజయవాడ), అమరావతి పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (క్యాడర్) అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ హెచ్ షణ్ముఖరావు, పి. మధుసూదనరావు, రఫాత్, సంయుక్త కార్యదర్శి వి. లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శులు ఏ. శ్రీనివాసులు, ఎల్. ఆనందరావు, కోశాధికారి ఎస్ఎస్ఎస్ కుమార్; టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దైవప్రసాద్, ఉపాధ్యక్షులు కెబిఎస్ మణి తదితరులు పాల్గొని శ్రీనివాసులురెడ్డి సేవలను ప్రస్తుతిస్తూ ఘనంగా సన్మానించారు.

## 'ప్రభా'తం

# వెన్నెముక విరుగుతోంది!



ఎంత కష్టించి పనిచేసినా వ్యవసాయం గిట్టుబాటు కాకపోతే ఈ కష్టాల సేద్యం ఎంతకాలం చేయాలి?..పంటలు పండించినా తగ్గ గిట్టుబాటు ధరలు లేకుంటే తమ జీవనం ఎలా సాగాలి?.. కుటుంబాలను ఎలా పోషించుకోవాలి?.. దేశంలోని అనేక ప్రాంతాల్లో రైతుల దీనావస్థ ఇది. ఒకవైపు విపత్తుల బాధ, మరోవైపు అప్పుల బాధ. ఇంకోవైపు తీరని సమస్యల వేదన. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి అన్నదాతల అభ్యున్నతికి కృషిచేయాలి.

దేశానికి అన్నం పెట్టే అన్నదాతైన రైతన్నకే పిడికెడు మెతుకులు కరువైతే?.. దేశాన్ని సస్యశ్యామలం చేసే రైతు బతుకే కష్టాలమయంగా మారితే?.. దేశానికి వెన్నెముకైన ఆ రైతే కుంగిపోతే ఇక దేశం పరిస్థితి ఏమిటి?...ఎంత కష్టించి పనిచేసినా వ్యవసాయం ఫలసాయం ఇవ్వకపోతే ఈ కష్టాల సేద్యం ఎంత కాలం చేయాలి?.. ఆదుకుంటామన్న ప్రభుత్వాలు ఆదుకోకపోతే ఎలా జీవనం గడవాలి?.. రైతన్నల దీనావస్థ ఇది.

దేశంలోని అనేక ప్రాంతాల్లో రైతుల దుస్థితి ఇది. సకాలానికి వర్షాలు రాకపోవడం.. ఒకవేళ వచ్చినా అకాలంలో వచ్చి కొంపముంచడం, వస్తే కుండపోత..రాకుంటే కరువువాత అన్నట్లుగా.. ప్రకృతి విపత్తులొకవైపు. పంటలు పండించడమే గగనమైతే..గిట్టుబాటు ధరలు లేక..కుటుంబాలను పోషించుకోలేక పడుతున్న నరకయాతనలు మరోవైపు. రైతన్న బతుకంతా వేదనల మయం..కష్టాల సేద్యంతో జీవితమంతా కన్నీటిమయం... ఇదీ మన రైతన్నల ముఖచిత్రం. అందులోనూ ఈ తొలకరి జల్లుల వేళ..రుతుపవనాల రాకతో ఇక ఏరువాక బాగా సాగుతుందని ఏరువాక పౌర్ణమి పండుగ వచ్చిందని సంబరపడుతున్న రోజున, రైతులందరికీ ఈ ఏడాదైనా పంటల సిరులు బాగా పండుతాయని ఆశపడుతున్న శుభవేళ...తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు మహాప్రభో.. అని మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో రైతన్నలు దీనంగా వాపోతూ ఆందోళనల బాటపట్టడం రైతన్నల దీనస్థితికి నిదర్శనం. ఆ ఆందోళనలు చివరికి పోలీసు కాల్పులదాకా సాగడం మరెంతో బాధాకరం.

ఒక్క మధ్యప్రదేశ్‌లోనే కాదు.. దేశంలోని అనేక ప్రదేశాల్లో ఇదే దుస్థితి. ఆయా రాష్ట్రాల్లో రైతులు ఎంతోకాలంగా సమస్యల సుడిగుండంలోనే కొట్టుమిట్టాడుతున్నారు. కాడి పట్టిన దగ్గరనుంచి పంట పండేదాకా, చేతికందిన పంట చేతికొచ్చేదాకా రైతులు ఎన్నో కష్టాలు పడుతూనే వున్నారు. ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా మా తలరాతలు మాత్రం మారడం లేదన్నది రైతుల ఆవేదన. అయినా, ఎన్నెన్నో పథకాలు వస్తూనే వున్నా అనేక సంవత్సరాలుగా రైతన్నల జీవన పరిస్థితుల్లో మార్పేమీ వుండడం లేదు. వారి సమస్యలు మాత్రం తీరడం లేదు. రెక్కల కష్టాన్నే నమ్ముకుని, అప్పోసప్పో చేసుకుని పగలనకా, రాత్రనకా కాయకష్టం చేసే రైతన్నలకు ఎంతోకాలంగా గిట్టుబాటు ధరలు లేకపోవడం ఎంతో విచారకరం!.. రైతుల సమస్యలు తీరుస్తామంటూ నాయకులు చెప్పడమే తప్ప రైతుల అభ్యున్నతికి వారు చేసిందేమీ వుండడం లేదు. చెప్పిన మాటలు నిలబెట్టుకోవడమూ లేదు. అన్నీ శుష్కవాగ్దానాలు.. శూన్యహస్తాలే. రైతుల సంక్షేమమే ధ్యేయమని ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్నా..రైతులు మాత్రం సంక్షోభ క్షోభల్లోంచి గట్టెక్కడం లేదు. ముఖ్యంగా దళారులు, వ్యాపారుల మాయాజాలం నుంచి, దళారీ వ్యవస్థ నుంచి రైతులకు అసలు విముక్తే వుండడం లేదు. రైతులు తమ కష్టాన్ని మార్కెట్లో అతితక్కువ ధరకు నిలువునా తెగనమ్మేసుకోక తప్పడం లేదు. నిత్యం రైతులకు ఇదే వేదన.. రోదన. మరోవైపు, రైతులను తెగ పొగిడే స్తూనే వారి శ్రమను నిలువు దోపిడీచేస్తున్న దళారీలను..రకరకాల మాయగాళ్ళని నియంత్రించేందుకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు కూడా శూన్యమే. అంతేకాదు, ప్రభుత్వాలు కూడా మభ్యపెట్టే మాటలే చెప్తే.. ఇక ఆ రైతులు తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలి?..సాగునీటి రంగానికి ఏటా కోట్లాదిరూపాయలు వ్యయం చేస్తున్నా, అనేకప్రాంతాలు నేటికీ సాగునీరందక పంటపొలాలు వర్షాల మీదే ఆధారపడడం, చివరికి అదునుకు వానలు రాక పంటలు ఎండిపోతూనే వుండడం ఏమిటి?... రైతులకు అందజేస్తామంటున్న పథకాలు అసలైన లబ్దిదారుల దాకా చేరడమే లేదనే వాస్తవం ప్రభుత్వాలకు తెలియదా?.. దేశంలోనే కాదు, రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి. రానురాను వ్యవసాయరంగం కుదేలైపోతోంది. ఒకవైపు వర్షాభావం.. మరోవైపు సమస్యల భారం. అనేక రకాల పంటలు పండించే రైతులు ఆయా పంటలకు సంబంధించి ఎన్నో రకాల సమస్యల్లో చిక్కుకుని, అనునిత్యం నానా బాధలు పడుతున్నారు. వ్యవసాయశాఖ, నీటి పారుదల శాఖ.. ఉద్యానశాఖ ఇంకా వాటిలో రకరకాల విభాగాలు, బోలెడంత అధికారగణం వున్నా రైతులకు ఒరిగిందేమీ వుండడం లేదు. సంక్షేమం.. అభివృద్ధి.. పథకాల అమలు, అన్నీ మొక్కుబడి తతంగాలుగానే వుంటున్నాయి తప్ప పొలంబాట పట్టే నాథులే లేరు. విత్తనాలు, ఎరువుల మాయాజాలం, పురుగుమందుల మాయాజాలం...మార్కెట్లో దళారుల మాయాజాలం ఇలా అన్నీ రైతులను నిలువు దోపిడీ చేసేవే తప్ప అటు పంటలకు కానీ, ఇటు రైతు జీవితాలకు కానీ భరోసా వుండడం లేదు. ఇక రుణమాఫీ అన్నది మరో పెద్ద ప్రహసనంగా మారింది. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అసలైన రైతులకే చేరుతున్నాయా లేదా అన్నది ఎవరూ పట్టించుకోవడం లేదు.

మరోవైపు సాదాసీదా రైతన్నలు మాత్రం ఏ సాయమూ అందక తమ కష్టాలేవో తామే పడుతున్నారు. దేశంలో రైతన్నల జీవనపరిస్థితులు ఎంతో దయనీయంగా వుంటున్నా, వారి జీవనప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వాలు శ్రద్ధ చూరవ చూపడం లేదు. ఫలితంగా వారి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా వుంటోంది. ఇకనైనా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశానికి అన్నం పెట్టే రైతన్నల అభ్యున్నతికి కట్టుబడి పనిచేయాలి. అన్నదాతలు ఆకలితో అలమటించకుండా వారంతా క్షేమంగా.. సంతోషంగా వుండేలా చూడాలి. నిత్యం ఎన్నో సమస్యలతో అల్లాడుతున్న రైతుల కష్టాలు తీర్చేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించి చిత్తశుద్ధితో అమలుచేయాలి. రైతు సంక్షేమమే జాతికి క్షేమం కనుక, కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు ఇకనైనా వారి సమస్యలు తీర్చి, వారిని అన్ని విధాలుగా ఆదుకుని అన్నదాతల అభ్యున్నతికి బాటలు వేస్తాయని ఆశిద్దాం!

---

## నేటి బాలలే...
# రేపటి పౌరులు

నేటి బాలలే రేపటి పౌరులని, వారే దేశ సంపద, సౌభాగ్యమని నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్-2 వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో వరల్డ్ విజన్ ఇండియా బాలల శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రచార రథయాత్ర ప్రారంభోత్సవం జరిగింది. ఈ రథాన్ని జేసి-2 వెంకట సుబ్బారెడ్డి జెండా వూపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పిల్లల్ని పనిలో పెట్టి వెట్టి చాకిరి చేయిస్తే వారిని కఠినంగా శిక్షించాల్సి వుంటుందన్నారు. ఐసిడిఎస్ పి.డి ప్రశాంతి, వరల్డ్ విజన్ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ జోషిబాబు, కరుణ, శ్రీకాంత్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నెల్లూరుజిల్లా నాయీ బ్రాహ్మణ ఎంప్లాయిస్ సొసైటి ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నెల్లూరు నవాబుపేటలోని శ్రీ మద్దులూరి వీరరాఘవయ్య నాయీ బ్రాహ్మణ కళ్యాణ మండపంలో నాయీ బ్రాహ్మణ విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ప్రశంసాపత్రాలు, నగదును అందజేశారు.

2016-17 విద్యాసంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు రూ. 2వేల వంతున అందజేశారు. ఈ కార్యక్రమానికి దువ్వూరు రామమోహన్ రావు, దువ్వూరు లీలావతి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. సంఘం నిధుల నుండి పదిమంది నిరుపేద నాయీ బ్రాహ్మణులకు రూ.5వేలు వంతున, వైద్యఖర్చులు, స్వయం ఉపాధి కొరకు రూ.50వేలు వంతున అందజేశారు. ముఖ్యఅతిథులుగా నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, మాజీఎమ్మెల్యే, టిడిపి నగర ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, 9వ డివిజన్ కార్పొరేటర్ దామవరపు రాజశేఖర్, నెల్లూరుజిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీకౌన్సిలర్ యాలమూరి రంగయ్యనాయుడు పాల్గొని మాట్లాడారు.

సంఘ గౌరవాధ్యక్షులు డా॥ కె.సూర్యనారాయణ, భీమవరపు లక్ష్మయ్య, డి.వి.శివప్రసాదరావు, అధ్యక్షులు వేలూరు రంగారావు, కె.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, వరికుంట్ల హజరత్తయ్య, వల్లూరు బాలకేశవులు, ఆర్.ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 19న ఆదిశంకరాచార్యుల
# విగ్రహ ప్రతిష్ట



నెల్లూరు మూలాపేటలోని కంచి కామాక్షితాయి ఆలయంలో ఈ నెల 19న ఆదిశంకరాచార్యుల విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఉదయం 8గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, కలశస్థాపన, మండపారాధన, అగ్నిమదనం, మూలతంత్ర హోమాలు, శంకరాచార్యుల విగ్రహ ఆదివాసం తదితర విశేష కార్యక్రమాలు వేదపఠనం మధ్య సాగనున్నాయి. భీమవరానికి చెందిన ఉత్తమ వేదపండిత పురస్కార గ్రహీత రామచంద్ర సోమయాజి ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తారు.

---




## అద్వానీని గౌరవించాలి

రాజకీయ యోధుడు అద్వానీ! ఈరోజు జాతీయ రాజకీయాలలో వున్న ఎంతోమంది నాయకులకు గురువు. నిరంతర రాజకీయ పోరాట ధీరుడు. ముఖ్యంగా ఆయన లేకుంటే భారతీయ జనతాపార్టీయే లేదు. ప్రధానమంత్రి పదవికి అన్ని అర్హతలున్నోడు. ఎప్పుడో ప్రధాని కావలసినోడు. దరిద్రం ఆయనను నీడలా వెంటాడింది. ఇప్పుడు రాష్ట్రపతి ఎన్నికలొచ్చాయి. ఆయన మీద బాబ్రీ మసీదు కేసును తిరగతోడించారనే నింద ప్రధాని మోడీ మీదే వుంది. మోడీ ఈరోజు ఈ స్థాయిలో వున్నాడంటే కారణం అద్వానీయే! అద్వానీని రాష్ట్రపతిగా చేసి గౌరవిస్తేనే మోడీ కూడా కృతజ్ఞత చూపినట్లవుతుంది. అద్వానీని ఇప్పుడు రాష్ట్రపతిని చేయలేకపోతే ఇంకెప్పుడూ చేయలేరు.

*- వి.నరసింహాచారి, వరదయ్యపాలెం.*

## అంతా బూటకం

తమ లోపాలు కప్పిపుచ్చుకోవడానికి చంద్రబాబు చేయని దుర్మార్గమంటూ లేకుండా పోయింది. కొద్దిపాటి వర్షానికే అమరావతి రాజధాని తాత్కాలిక భవనాలలో బాబు గారి భాగోతం బయట పడింది. ఈ వర్షానికే తాత్కాలిక అసెంబ్లీ సచివాలయం భవనాలు ఉరిసాయి. మన గ్రామాల్లో మేస్త్రీలు కట్టిన భవనాలే ఎంతో శుభ్రంగా వుంటున్నాయి. సింగపూర్... సింగపూర్ అని చంద్రబాబు ఎగిరెగిరి పడింది ఇలాంటి భవనాలు కట్టుకోవడానికేనా?

*- జి.బాబ్జీ, నెల్లూరు.*

## కార్డుల మంజూరులో ఇబ్బందులు

పేదలకు తెల్లరేషన్‌కార్డు చాలా అవసరం. రేషన్ సరుకులు లభించడమేకాక బహుళ ప్రయోజనాలున్నాయి. విద్యార్థి ఉపకార వేతనాలు, ఉచిత విద్యాబోధన, ఆరోగ్య బీమా, పక్కా గృహాలు వంటి వాటన్నింటికి కూడా తెల్లకార్డే ఆధారం. తెల్లకార్డులు జారీ చేసే అధికారులు వారి ఇళ్లను సందర్శించి ఐరిస్, ఫోటోలు, గృహయజమాని వివరాలు తీసుకుని తెల్లకార్డులు మంజూరు చేస్తారు. కాని కొంతమంది అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి తెల్లకార్డులు పొందారు. డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ కోసం అసత్యాలు, తప్పుడు వివరాలు ఇచ్చి తెల్లకార్డులు తీసుకున్నారు. అలాగే దళిత కుటుంబాలలో కూడా చాలామంది ధనవంతులై వుండి కూడా తెల్లకార్డులు పొందారు. ఇప్పుడు భోగస్ కార్డులు ఏరివేసే ప్రక్రియలో ఐరిస్ సరిపోలేదని, ఆధార్ లింకు సరిపోలేదని అధికారులు పేదవారిని ఇబ్బంది పెడుతూ రేషన్‌కార్డులు రద్దు చేస్తున్నారు. ఇప్పటికైనా అధిక సంఖ్యలో ఎన్యుమరేటర్లను నియమించి, ప్రతి ఇంటిని నేరుగా సందర్శించి, వివరాలు పక్కాగా నమోదు చేసి తెల్లకార్డులు జారీ చేయాలి.

*- బాధితులు.*



# నెల్లూరు నగరాభివృద్ధికి...

# నాలుగు స్థంభాలు



**కన్నతల్లిని జన్మభూమిని ఎప్పుడూ మరచిపోకూడదని మన కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు ప్రతి సభలోనూ చెబుతుంటారు. మరి ఎంతమంది ఆ మాటను చెవికెక్కించుకుంటారన్నది వేరే విషయం. కాని ఆయన చెప్పే మాట ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది. కన్నతల్లిని జన్మభూమిని మరువవద్దని ఆయన చెబుతున్న మాటలను చెవికెక్కించుకునే చాలామంది ప్రవాసభారతీయులు గాని, స్వదేశంలో వున్న పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు గాని తమ పుట్టిన గ్రామాలను దత్తత తీసుకుని ఆ గ్రామాలలో ఎన్నో సేవా కార్యక్రమాలను, అభివృద్ధి ప్రాజెక్టులను చేపడుతున్నారు.**

ఈ కోణంలో చూస్తే నెల్లూరు నగరానికి అధికార కోణంలోగాని, రాజకీయ కోణంలోగాని ఇప్పుడు



నలుగురు దత్తపుత్రులున్నారు. ఈ నలుగురు కూడా నెల్లూరుతో అనుబంధం ముడిపడి వున్నోళ్లే! కేంద్రంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా వున్న వెంకయ్యనాయుడు నెల్లూరీయుడే! రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖామంత్రి నారాయణ నెల్లూరోడే! ఇక మేయర్ పోస్ట్‌లో ఎవరున్నా నెల్లూరు బ్రాండే! వీరికి కొత్తగా నాలుగో వ్యక్తి జత చేరాడు. ఆయనే 'నుడా' ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి. నెల్లూరు నగరాభివృద్ధికి నాలుగు స్థంభాలు. ఇక్కడ నిధులిచ్చే వాళ్లిద్దరు అయితే నెల్లూరు నగరాభివృద్ధికి ప్రణాళికలు అమలు పరచాల్సిన వాళ్ళు మిగతా ఇద్దరు. నెల్లూరు మేయర్‌కు కార్పొరేషన్ పరిధిలో వచ్చే ఆదాయం జీతాలకు, ఖర్చులకు చాలదు. ఇక నగరంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఆస్కారం ఎక్కడుంటుంది. కొత్తగా నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటయ్యింది. తొలి ఛైర్మెన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నియమించ బడ్డాడు. నెల్లూరు నగరం మీద బాగా అవగాహన వున్న నాయకుడు. నెల్లూరు కోసం ఏదన్నా చేయాలన్న తపన ఉన్నోడు. కాకపోతే వీళ్లకు నిధుల లభ్యత చాలా తక్కువ.

అందుకని 'నుడా' ఛైర్మెన్ అయినా, నెల్లూరు మేయర్ అయినా కేంద్రమంత్రి వెంకయ్య, రాష్ట్రమంత్రి నారాయణలతో సమన్వయం కావాలి. నెల్లూరుకు ఏం కావాలి, ఏం చేయాలి, నెల్లూరులో రోడ్లను ఎలా వెడల్పు చేయాలి, నెల్లూరురోడ్ల మీద ట్రాఫిక్ తగ్గించాలంటే ఇంకేం చేయాలి, నెల్లూరును క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మార్చడానికి ఎలాంటి ప్రణాళికలు అమలు చేయాలి. ప్రజల తాగునీటి కష్టాలు తీర్చడానికి ఏ స్కీంలు అమలు చేయాలి, మురికి వాడలను ఏ విధంగా అభివృద్ధి చేయాలి, ఏఏ అభివృద్ధి పనుల కోసం ఎవరెవరిని సంప్రదించాలి, ఎవరెవరిని అందులో భాగస్వాము లను చేయాలనే అంశాలపై ఒక రిపోర్ట్‌ను తయారుచేసుకోవాలి. అందులో ముందు వెంకయ్య ద్వారా సాధించుకోవాల్సినవి, మంత్రి నారాయణ ద్వారా తెచ్చుకోవాల్సినవి విభజించుకోవాలి. వారిని ఎప్పటి కప్పుడు సంప్రదించుకుంటూ అభివృద్ధికి డిజైన్‌లను ఏర్పరచుకుంటూ ముందుకు పోతే నెల్లూరు రూపురేఖలను కొంతవరకన్నా మార్చగలరు!



# కమలంలో 'కుల'కలం

**నెల్లూరుజిల్లా కమలం పార్టీలో కులం కంపు రేగింది. ఉన్న పదవులన్నీ ఒకే సామాజిక వర్గం వారికిస్తున్నారంటూ అసమ్మతి రేగింది. జిల్లా పార్టీలో ఎప్పుడూ లేని విధంగా కులం కాష్టం రగిలింది. 'నుడా' డైరెక్టర్ పదవి విషయంలోనే కులం చిచ్చుకు ఆజ్యం పోసినట్లయ్యింది.**

బీజేపీకి సంబంధించి నెల్లూరుజిల్లాలో వెంకయ్యనాయుడు పెద్ద నాయకుడు. కాకపోతే ఆయన జాతీయ నాయకుడు కాబట్టి జిల్లా స్థాయిలో అతనిని చూడలేము. రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ జిల్లాలో బీజేపీ వాళ్ళకు కొన్ని పదవులిచ్చారు. కనుమూరు పరిశ్చంద్రారెడ్డిని గూడూరు వెంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మెన్‌గా, ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మరణించిన బెజవాడ అనిల్‌కుమార్‌రెడ్డిని పెద్దాసుపత్రి అభివృద్ధి కమిటీలో సభ్యుడిగా నియమించడం తెలిసిందే! అలాగే బీజేపీ సీనియర్ నాయకుడు, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్ రెడ్డిని ఎంపెడా డైరెక్టర్‌గా నియమించడం తెలిసిందే! ఈ ముగ్గురు కూడా ఒకే సామాజిక వర్గం వాళ్ళు. ఇంతవరకు బాగానే వుండింది.

తాజాగా నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా)లో బీజేపీ నుండి ఒకరిని డైరెక్టర్‌గా నియమించారు. నాయుడుపేటకు చెందిన సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని నుడాలో డైరెక్టర్‌గా నియమించడంపై ఆ పార్టీలోని మిగతా సామాజిక వర్గాల నాయకులు పదవులన్నీ ఒక సామాజికవర్గం వారికేనా అని కారాలు మిరియాలు నూరుతున్నారు. అయితే ఇది ఉద్దేశ్యపూర్వకంగా జరిగిన నియామకం కాదని తెలుస్తోంది. 'నుడా'లో ముగ్గురు డైరెక్టర్‌లకు గాను బీజేపీకి ఒక పోస్ట్ ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకోసం పేర్లు పంపమని బీజేపీ జిల్లా అధ్యక్షుడిని తెలుగుదేశంపార్టీ వాళ్లు కోరారు. దాంతో బీజేపీ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి నగరానికి చెందిన బీజేపీ నాయకుడు ఎం.ఈశ్వరయ్య పేరును సూచించినట్లు తెలుస్తోంది. అయితే ఒక పేరు కాదని, ఆప్షన్‌గా ఇంకో పేరు కూడా పంపించమని, అది కూడా శ్రీసిటీ, మేనకూరు సెజ్‌లున్నాయి కాబట్టి నాయుడుపేట డివిజన్ నుండి పంపించమని తెలుగుదేశం వాళ్లు కోరారు. దీంతో సురేంద్రరెడ్డి రెండో పేరుగా నాయుడుపేటకు చెందిన సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి పేరును పంపాడు. నెల్లూరు నగరం నుండి ఛైర్మెన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఉన్నారు. ఇక ఆత్మకూరు డివిజన్ నుండి ఖాజా వలిని, కావలి డివిజన్ నుండి పాలడుగు రంగారావును డైరెక్టర్లుగా తీసుకున్నారు. ఇక నాయుడుపేట డివిజన్‌కు కూడా ప్రాధాన్యత కల్పించాలనే ఉద్దేశ్యంతో ఆప్షన్‌గా ఇచ్చివున్న సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి పేరును ఖరారు చేసారు. బీజేపీ వాళ్ళు ఆప్షన్ క్రింద ఇచ్చిన పేరే ఈరోజు ఆ పార్టీలో కుల చిచ్చును రాజేసింది.



# నిధుల కేటాయింపులో వివక్ష వద్దు

అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపులో నెల్లూరు నగర నియోజకవర్గానికి అన్యాయం జరుగుతోందని నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీన నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఢిల్లీరావును ఆయన కలిసి పలు సమస్యలు వివరించారు. సంతపేట, శెట్టిగుంట రోడ్డులలోని మార్కెట్‌లను కార్పొరేషన్ నిధులతో అభివృద్ధి చేస్తే కార్పొరేషన్‌కు ఆదాయంతో పాటు చుట్టుపక్కల పది డివిజన్‌ల ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన చెప్పారు. అలాగే పలు ప్రాంతాలలో డ్రెయిన్‌లు నిర్మించాలని కోరారు. నెల్లూరు నగరం నుండే కార్పొరేషన్‌కు ఎక్కువ ఆదాయం వస్తుందని, కాబట్టి 40శాతం నిధులు నగర నియోజకవర్గానికే కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, జి.నాగరాజు, ఖలీల్ అహ్మద్, దేవరకొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ పాలనతోనే దేశాభివృద్ధి



ప్రధానమంత్రి నరేంద్రమోడీ పరిపాలనతోనే మన దేశం అభివృద్ధి వైపు పయనిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. మోడీ ఫెస్ట్ పేరుతో ఏర్పాటు చేసిన ప్రచారరథాన్ని మంగళవారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన జెండా వూపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా మోడీపాలన కొనసాగిస్తున్నారన్నారు. బీజేపీ విధి విధానాలను ప్రజలకు చేరవేసేందుకు కేంద్రమంత్రుల నుంచి పార్టీ కార్యకర్తల వరకు ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే జిల్లాకు మోడీ ఫెస్ట్ పేరుతో ఒక సంచార వాహనాన్ని కేటాయించారన్నారు. ఈ వాహనం ద్వారా జిల్లా వ్యాప్తంగా మూడురోజుల పాటు వీడియో చిత్రాల ద్వారా మోదీ కొనసాగిస్తున్న పరిపాలన, ప్రవేశపట్టిన సంక్షేమ పథకాలపై ప్రచారం చేస్తామన్నారు. ఈ నెల 16, 17, 18 తేదీలలో వీఆర్‌సి మైదానంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌ను కేంద్రమంత్రి సత్యానంద్‌గౌడ్ ప్రారంభిస్తారని తెలిపారు. రాధాకృష్ణారెడ్డి, రాఘవయ్య, ఈశ్వరయ్య, సుధాకర్‌రెడ్డి, మధు, కోటేశ్వరమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## నాయుడుపేట టు పూతలపట్టు...

# ఆరులైన్లకు ఆమోదం

- తగ్గనున్న ప్రమాదాలు
- తగ్గబోతున్న ప్రయాణకాలం



ఏపిలోనే అత్యంత రద్దీ ఉన్న రహదారులలో ప్రధానమైనది నాయుడుపేట - బెంగుళూరు రోడ్డు. ఏపి నుండి తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలలోని పలు ప్రాంతాలను కలిపే ప్రధాన మార్గమిది. అంతేకాదు, ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలన్నీ కొలువైన రహదారి. శ్రీకాళహస్తి, తిరుమల, కాణిపాకం, శ్రీపురం, కంచి వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్ళేవాళ్లకు ఈ రోడ్డే ప్రధాన మార్గం. ఏపిలో ప్రతి ఒక్క ఆర్టీసీ డిపో నుండి తిరుమల తిరుపతికి బస్సులు నడుస్తుంటాయి. ఇక తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల బస్సులు కూడా ఈ రోడ్డు గుండానే తిరుగుతుంటాయి. ఏపిలోని జిల్లాలన్నింటి నుండి కూడా బెంగుళూరుకు బస్సులు ఈ రోడ్డు గుండానే నడుస్తుంటాయి. ఇక రవాణా లారీలైతే లెక్కేలేదు. రోజుకు కొన్ని వేల వాహనాలు తిరిగే రోడ్డు ఇది. ఎప్పుడో నాలుగు లైన్లుగా మార్చాల్సిన రహదారి. ఇప్పటికి కూడా డబుల్ లైన్ రోడ్డు మాదిరిగానే వుంది. వాహనాలు పెరిగిపోవడం, రోడ్డు విస్తరించకపోవడం మూలంగా ప్రతిరోజూ ఈ రోడ్డు మీద ప్రమాదాలు జరుగుతూనే వున్నాయి. అంతేకాదు, ప్రయాణకాలం కూడా గంట పట్టేది రెండు గంటలవుతూ వచ్చింది. ఇప్పుడు కారులో నాయుడుపేట నుండి తిరుపతికి పోవాలంటే ఒకటిన్నర గంట పడుతుంది. ఇంకో ఏడాది తర్వాత వాహనాలు ఇంకా పెరిగి ప్రయాణ కాలం రెండున్నర గంట కూడా కావచ్చు.

ఈ రోడ్డును ఎప్పుడో జాతీయ రహదారుల్లో చేర్చారు. వై.యస్. హయాంలోనే నాయుడుపేట - చిత్తూరుజిల్లాలోని పూతలపట్టు మధ్య 220కిలోమీటర్ల రోడ్డును నాలుగులైన్లుగా మార్చాలని నిర్ణయించారు. అయితే ఆ పని అప్పుడు జరగలేదు. తాజాగా 24 అడుగుల వెడల్పున్న ఈ రోడ్డును 90అడుగుల వెడల్పుతో ఆరులైన్లుగా మార్చేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆమోదముద్ర వేసింది. ఇందుకు సంబంధించి భూసేకరణే త్వరగా చేపట్టాల్సి వుంది. ప్రైవేట్ భూములను భారీగానే కొనాల్సి వుంటుంది. కాబట్టి వెంటనే ఆ ప్రక్రియను పూర్తి చేస్తే తర్వాత రోడ్డు వెడల్పు చేయడం సులభమవుతుంది.

# నెల్లూరు కబుర్లు

• మేయర్‌కు ఎదురుదెబ్బ

## నెల్లూరు నెక్స్ట్‌కు ఫస్ట్ కాపీ కూడా లేదు

నెల్లూరు కార్పొరేషన్ తరఫున నెల్లూరు నెక్స్ట్ పేరుతో నడుపుతున్న ఈ-పేపర్‌కు డిఎంఎ కన్నబాబు బ్రేకులు వేశాడు. పేపర్‌ను ప్రారంభించి ఏడు నెలలు కావస్తున్నా ఇంతవరకు ఒక్క కాపీని కూడా బయటకు తీసుకురాకపోవడంతో ఈ-పేపర్‌ను డిఎంఎ అడ్డంగా రద్దు చేశారు. 2016 డిసెంబర్‌లో మేయర్ అజీజ్ నెల్లూరు నెక్స్ట్ పేరుతో ఈ-పేపర్ నడపాలని నిర్ణయించారు. దీని నిర్వహణ కోసం ఒక ఎడిటర్‌తో పాటు మరో 5మంది సిబ్బందిని నియమించారు. ఎడిటర్‌గా తన ముఖ్యఅనుచరుడిని పెట్టుకుని అతనికి నెలకు 50వేల రూపాయలు జీతంగా నిర్ణయించారు. మిగతావాళ్లకు 11వేల వంతున నిర్ణయించారు. ప్రతిపక్ష సభ్యులు దీనిని వ్యతిరేకించినా మేయర్ మాత్రం స్టాండింగ్ కమిటీలో పెట్టి ఆమోదింపచేసుకున్నాడు. అయితే అప్పటి నుండి ఇప్పటివరకు ఒక్క పేపర్ కూడా రాలేదు. ఇటీవల మున్సిపల్ పరిపాలనా విభాగం డైరెక్టర్ కన్నబాబు దృష్టికి ఈ విషయం వెళ్లింది. ఈ-పేపర్ ఒక దండగమారి ఖర్చుగా ఆయన గుర్తించారు. ఇప్పటివరకు ఇవ్వాల్సిన జీతాలను ఇచ్చేసి పేపర్‌ను ఆపు చేయమని కమిషనర్ ఢిల్లీరావుకు ఉత్తర్వులు పంపారు.

## స్కూలు బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు తప్పనిసరి

### - రవాణాశాఖ ఉపకమిషనర్ శివరాంప్రసాద్



స్కూలు బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు ఉండాలని, లేకుంటే వాటిని సీజ్ చేసి సంబంధిత యజమాని, డ్రైవర్‌ను కోర్టుకు ప్రాసిక్యూషన్ పెట్టనున్నట్లు రవాణాశాఖ రవాణా శాఖ ఉపకమిషనర్ ఎన్.శివ రాంప్రసాద్ తెలిపారు. సోమవారం విలేఖర్లతో మాట్లాడుతూ పాఠశాలలు పునః ప్రారంభించిన క్రమంలో తనిఖీలు చేయగా ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు తీసుకోకుండా తిరుగు తున్న నాలుగు బస్సులను సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,042 బస్సులు ఉండగా 525బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికేట్లను తీసుకున్నట్లు తెలిపారు. షోరూముల్లో గత ఏడాది అక్టోబర్ నుంచి అమ్మకాలు చేసిన 13వేల వాహనాల్లో 311 వాహనాలు ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ కాకుండా పెండింగ్‌లో వున్నాయన్నారు. టెంపరరీ, పర్మినెంట్ రిజిస్ట్రేషన్లు చేయకుండా వినియోగదారులకు అమ్మిన నాలుగు షోరూం యజమానులపై కమిషనర్‌కు నివేదిక పంపించినట్లు తెలిపారు. ఇన్‌ఛార్జి ఆర్టీఓ కిషోర్, ఎంవిఐ ఆదినారాయణ, ఏఓలు విజయకుమార్‌సాయి పాల్గొన్నారు.

## నరసింహకొండలో వెంకయ్య సతీమణి



నెల్లూరురూరల్ మండలం నరసింహకొండలో కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో మంగళవారం కేంద్రమంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. తొలుత ఆలయ ఇఒ అర్వభూమి శ్రీనివాసులురెడ్డి, ప్రధానార్చకులు స్వాగతం పలికారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారికి విశేషపూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## 'అవోపా' నూతన కార్యవర్గం

ది ఆర్యవైశ్య అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వారు ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని "వైశ్యభవన్"లో జరిగిన సర్వసభ్య సమావేశంలో 2017-18 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులుగా సొల్లేటి వెలుగొండయ్య, ఎస్.నమశ్శివాయ, ఉపాధ్యక్షులుగా వి.వి.కోటేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్‌గుప్తా, కె.మనోహర్, కార్యదర్శులుగా సి.హెచ్.హనుమంతరావు, కె.బాలసుబ్రహ్మణ్యం, కె.ఎం.కృష్ణ, దరిశి నరసింహారావు, కోశాధికారిగా పొత్తూరు శ్రీనివాసులు ఎంపికయ్యారు. ఎన్నికల అధికారులుగా పి.పార్థసారధి, ఎం.నరసింహారావు వ్యవహరించారు.

### కార్డు నెంబరు అడిగారా...

## అంతే సంగతులు!

### అకౌంట్‌లో సొమ్ము క్షణాల్లో మాయం




దోపిడీ అనేది ఏ రూపంలో అయినా జరిగిపోతుంటుంది. నోట్ల రద్దు తర్వాత డిజిటల్ కరెన్సీని పెంచాలని ప్రభుత్వం ప్రచారం చేయడం తెలిసిందే! డిజిటల్ కరెన్సీతో దోపిడీలు, మోసాలు, టోటల్‌గా నేరాలు తగ్గుతాయన్నది ప్రభుత్వం ఉద్దేశ్యం. ఇంట్లోనో, జేబులోనో కరెన్సీ రూపంలో నగదు వుంటే దోపిడీకి ఆస్కారం వుంటుంది. అదే డిజిటల్ కరెన్సీ అయితే దొంగల బాధ ఉండదనే నమ్మక ముంది. అయితే మోసగాళ్లు ఇంకా తెలివి మీరిపోయారు. డిజిటల్ కరెన్సీని కూడా వదలడం లేదు.

ఎల్లయ్యకు ఒక నెంబర్ నుండి ఫోన్ వచ్చింది.. ఎల్లయ్య ఫోన్ ఆన్ చేశాడు. అవతల నుండి వాయిస్... మేం కస్టమర్ కేర్ నుండి మాట్లాడుతున్నామండి, మీ ఏటిఎం కార్డు రెన్యూవల్ చేయాలి, ఒక్క సారి కార్డుపైన వున్న పిన్‌కోడ్ నెంబర్ చెబుతారా అని ఎంతో వినయంగా అడుగుతారు. ఎల్లయ్య వెంటనే కార్డు మీద నెంబర్ చూసి చెప్పేస్తాడు. తర్వాత సివివి నెంబర్, ఓటిపి నెంబర్లు కూడా అడిగాడు. ఎల్లయ్య చెప్పేసాడు. ఫోన్ పెట్టేయగానే ఎల్లయ్య ఫోన్‌కు మెసేజ్... అతని అకౌంట్‌లో 70వేలు కట్... ఎల్లయ్యకు పరిస్థితి ఏమీ అర్థం కాలేదు. సైబర్ మోసగాళ్లు క్షణాల్లోనే ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా ఎల్లయ్య అకౌంట్‌లో వున్న 70వేల రూపాయలను ఊడ్చేసారన్నమాట. ఇది ఉదాహరణ. ఇటీవల జిల్లాలో ఇలాంటి కేసులు ఎక్కువుగానే జరిగాయి. సైబర్ నేరగాళ్లు ఏ పశ్చిమబెంగాల్ నుండో బీహార్ నుండో ఇలాంటి ఆపరేషన్లు నిర్వహిస్తుం టారు. అక్కడ నుండే ఇక్కడున్న వారి అకౌంట్లలో డబ్బులు ఊడ్చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పోయిన డబ్బులు తిరిగి రావనే ఉద్దేశ్యంతో బాధి తులు ఫిర్యాదు చేయడం లేదు. ముఖ్యంగా ఈ విషయంలో బ్యాంకులు, పోలీసులు, మీడియా కూడా ప్రజలను, ముఖ్యంగా క్రెడిట్ కార్డులు వాడే ఖాతాదారులను అప్రమత్తం చేయాల్సి వుంది. క్రెడిట్ కార్డు పిన్ నెంబర్ చాలా రహస్యం. ఎవరు ఫోన్ చేసి పిన్ నెంబర్ అడిగినా వెంటనే చెప్ప కుండా ఖాతాదారులు జాగ్రత్త పడాలి. ఖాతాదారుడి క్రెడిట్ కార్డు పిన్‌కోడ్‌తో బ్యాంకు అధికారులకు పని లేదు. దానికి సంబంధించిన సమస్య ఏదైనా వుంటే ఖాతాదారులు నేరుగా బ్యాంకులకే వెళ్లి మాట్లాడుకోవచ్చు. బ్యాంకులు తమ ఖాతాదారులకు ఆ విధంగా చైతన్యపర చాల్సిన అవసరం వుంది.

## 23 నుండి టౌన్‌హాల్‌లో

## చాగంటి ప్రవచనాలు



ప్రముఖ ఆధ్యాత్మిక గురువు డాక్టర్ చాగంటి కోటేశ్వరరావుచే ఈ నెల 23వ తేదీ నుండి 27వ తేదీ వరకు నెల్లూరు టౌన్‌హాలులో ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు చాగంటి వారు భక్తులకు ప్రవచనాలు వినిపిస్తారు. శ్రీ భరద్వాజ రుద్రాభిషేకం సంఘం ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది.

### ఇన్‌ఛార్జి

## అడిషనల్ కమిషనర్‌గా అంజయ్య

నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి అడిషనల్ కమిషనర్‌గా అంజయ్యకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఢిల్లీరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కార్పొరేషన్ సెక్రటరీగా అంజయ్య బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వ హిస్తున్న గుర్రం రవి బదిలీపై అనంత పురం జిల్లా ధర్మవరం మునిసిపల్ కమి షనర్‌గా వెళ్ళారు. సోమవారం గుర్రం రవి రిలీవ్ కావడంతో ఆయన స్థానంలో అంజయ్యకు అదనపు బాధ్యతలు అప్ప గించారు.

## పోస్టర్‌లను పీకిన మేయర్



గోడల మీద సినిమా పోస్టర్‌లు, గోడ పత్రికలు, వ్యాపార ప్రకటనల రాతలను తొలగించి నగరాన్ని పోస్టర్ ఫ్రీ సిటీగా మారుద్దామని నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ పిలుపునిచ్చారు. ఈ నెల 13వ తేదీన కమిషనర్ ఢిల్లీరావుతో కలిసి ఆయన ఏ.సి. స్టేడియం ప్రాంతంలో పర్యటించారు. రోడ్డు డివైడర్లు, గోడలపై వున్న వ్యాపార ప్రకటనల రాతలు, సినిమా పోస్టర్‌లపై పెయింట్ పూసారు. గోడలపై వున్న వాల్‌పోస్టర్‌లను పీకారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ అనుమతి లేకుండా ఎవరూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై పోస్టర్‌లు అంటించినా, రాతలతో గలీజు చేసినా చర్యలు తీసుకుంటా మన్నారు. వీటి కోసం కొన్ని ప్రాంతాలను ఎంపిక చేస్తామని, రాతలు రాసుకున్నా, వాల్‌పోస్టర్‌లు వేసుకున్నా అంతా అక్కడే చేసుకోవాలని హెచ్చరించారు. నెల్లూరు నగరాన్ని నీట్‌గా ఉంచడం కోసమే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

## షుగర్ వ్యాధిపై వాకర్స్‌కు అవగాహన



నెల్లూరు ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ షుగర్ వ్యాధిపై అపోలో హాస్పిటల్ డా॥ రామ్మోహన్ అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు పిల్లలకు జంక్‌ఫుడ్ ఇవ్వడం వల్ల ఒబిసిటి పెరిగి రాబోయే రోజుల్లో ఎదుగుదల తగ్గి షుగర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. షుగర్ వ్యాధిని నియంత్రణలో ఉంచుకుంటే గుండెజబ్బుల నుండి కాపాడుకోవచ్చున్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేలూరు రంగారావు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, ఓబులురెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 డిప్యూటీ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, డి.వి.సుబ్బయ్య, రాఘవేంద్రశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## సింహపురిలో కోలుకున్న బంగ్లాదేశీయురాలు

బంగ్లాదేశ్‌కు చెందిన ఓ మతిస్థిమితం లేని వృద్ధురాలిని నెల్లూరులోని సింహపురి ఆసుపత్రిలో చికిత్స చేసి కోలుకునేలా చేశారు. ఆమెను డిశ్చార్జ్ కూడా చేసి పూర్తి ఆరోగ్యంతో సొంత దేశానికి పంపించారు. దీనికి సంబంధించిన వివరాలను ఆసుపత్రి న్యూరోసర్జన్ డాక్టర్ వెంకటేశ్వరప్రసన్న విలేకరులకు వివరించారు. బంగ్లాదేశ్‌కు చెందిన అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ సలీనా అక్తర్ తల్లి షాహిదాబేగం(70) కొంతకాలంగా మతిస్థిమితం లేనట్లు ప్రవర్తిస్తూ నడవలేని స్థితిలో ఉండేది. బంగ్లాదేశ్‌లో ఎంతమంది డాక్టర్లకు చూపించినా ఆమె వ్యాధి నయం కాలేదు. చెన్నైలో వున్న బంగ్లాదేశ్ రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదించిన ఆయనకు సింహపురి ఆసుపత్రిలో న్యూరోసర్జన్ వెంకటేశ్వరప్రసన్న గురించి తెలిసింది. వెంటనే ఆయన తన తల్లిని సింహపురి ఆసుపత్రికి పంపించారు. డాక్టర్ వెంకటేశ్వరప్రసన్న ఆమెకు పూర్తిస్థాయి వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. దీంతో ఆమె కోలుకున్నారు. తమ తల్లికి పునర్జన్మ కల్పించినందుకు డాక్టర్ ప్రసన్నకు, ఆసుపత్రి యాజమాన్యానికి ఆ వృద్ధురాలి కుమార్తె సలీనా అక్తర్ కృతజ్ఞతలు తెలిపారు.

## మూడేళ్ళు....

# జిల్లాలో కనిపించని అభివృద్ధి ఆనవాళ్ళు!

### ప్రచారం జాస్తి... ప్రగతి నాస్తి

### మాటలు కోటలు దాటినా... చేతలు ఇంటి గుమ్మం దాటడం లేదు





కలెక్షన్‌లలో వరల్డ్ రికార్డ్ సృష్టించిన 'బాహుబలి' చిత్రాన్ని చూసిన తర్వాత అదే హీరో ప్రభాస్ నటించిన 'బుజ్జిగాడు' సినిమాను చూస్తే ఎంత చెత్త ఫీలింగ్ కలుగుతుందో, 2004 నుండి 2009 వరకు బాహుబలి లాంటి వై.యస్. పరిపాలన చూసిన రాష్ట్ర ప్రజలకు ఆ తర్వాత ఏ ముఖ్యమంత్రి పరిపాలనా నచ్చడం లేదు. ప్రజలు వై.యస్. స్థాయి పరిపాలనను ఆశిస్తుంటే, ఆయన తర్వాత వచ్చిన రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబునాయుడు పన్నీరు సెల్వం స్థాయి పెర్ఫార్మెన్స్ కూడా ఇవ్వలేకపోతున్నారు.

ముఖ్యంగా నెల్లూరుజిల్లాలోనే చూసుకుందాం. చంద్రబాబు సీఎం అయ్యాక ఈ మూడేళ్లలో జిల్లాలో ఏం జరిగింది. జనానికి ఏం ఒరిగింది! శ్రీసిటీలో గత కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తయిన పరిశ్రమలను ప్రారంభించారు. ఇఫ్కో సెజ్‌లో వివాదాల నడుమ 'గమేషా' అనే పరిశ్రమను ప్రారంభించారు. ఈ మూడేళ్లలో సీఎం రావడానికేమో 14సార్లు జిల్లాకు వచ్చాడు. కాని... ఏం ఉపయోగం. 2015లో వరదలప్పుడు కూడా వచ్చాడు. నగరంలో వున్న ఆక్రమణలన్నింటిని తొలగించాల్సిందేనని చంఢశాసనుడి లెవల్లో ఆదేశించాడు. కాని ఏం జరిగింది. సీఎం చెప్పిన పని ఇప్పటికీ అమలు జరగలేదు.

ఈ మూడేళ్లలో జిల్లాలో చెప్పుకోదగ్గ శాశ్వత అభివృద్ధి ప్రాజెక్ట్‌లేవీ లేవు. శ్రీసిటీ సెజ్ ఉంటే యాజమాన్యం సొంతంగా కష్టపడి విదేశీ కంపెనీలను ఒప్పించి తెచ్చుకుంటున్న ప్రాజెక్ట్‌లు తప్పితే ప్రభుత్వపరంగా, ప్రభుత్వం వల్ల వస్తున్న పెట్టుబడులేవీ లేవు. దక్షిణాసియాలోనే అతిపెద్ద పోర్టుగా రూపాంతరం చెందడానికి అన్ని అవకాశాలున్న పోర్టు కృష్ణపట్నం పోర్టు. వై.యస్. హయాంలో ఈ పోర్టు ప్రగతి పథంలో పరుగులు తీసింది. మొత్తం 41 బెర్తులతో రూపొందాల్సిన పోర్టు... వై.యస్. హయాంలో వున్న స్పీడే ఆ తర్వాత కూడా ఉండుంటే ఇప్పటికి 41 బెర్తులు పూర్తయి వుండేవి. కాని ఈ మూడేళ్లలో పోర్టు పరిధిలోకి ఒక కొత్త పరిశ్రమ కూడా రాలేదు. కనీసం ప్రభుత్వపరంగా ఈ సెజ్ పరిధిలోకి పెట్టుబడులను తీసుకొచ్చే ప్రయత్నాలు జరగలేదు. ఈ మూడేళ్లలో జిల్లా మొత్తానికి ఒక్క కొత్త ప్రాజెక్ట్ గాని, పదిమందికి ఉద్యోగాలిచ్చే పరిశ్రమలు గాని, ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లు గాని వచ్చిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదలైన నెల్లూరు, సంగం బ్యారేజీలు కూడా ఇంతవరకు ఒక కొలిక్కి రాలేదు. జిల్లాకు చంద్రబాబు అప్పుడప్పుడు వస్తున్నాడు, పోతున్నాడు. ఉపయోగమేంటో తెలియదు. ఈ మూడేళ్లలో జిల్లాలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పని ఒక్కటీ లేదు.

అదే 2004లో వై.యస్. సీఎం అయ్యాక మూడేళ్లలోనే కృష్ణపట్నం పోర్టు పరుగులు పెట్టింది. అపాచి సెజ్ శంకుస్థాపన జరిగిన మరుసటి ఏడాదే ఉత్పత్తులు ప్రారంభించింది. మేనకూరు సెజ్ ఒకందుకు మొదలు పెట్టినా ఇంకో రకంగా ముందుకు పోయింది. శ్రీసిటీ సెజ్ ఈరోజు దేశంలోనే అత్యున్నత సెజ్‌గా అభివృద్ధి చెందింది. వాకాడు వద్ద స్వర్ణముఖి బ్యారేజ్ కట్టుకోగలిగాం. సోమశిలలో 74టిఎంసీల పూర్తి సామర్థ్యంలో నీటిని నిల్వ ఉంచగలిగారు.

మొదటి వై.యస్. మూడేళ్ల పాలన ముందు నేటి చంద్రబాబు మూడేళ్ల పాలన దిగదుడుపే!

# ప్రజల సహకారంతోనే నడుస్తున్నాయి...

- ఘనంగా నెల్లూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు శతాబ్ది ఉత్సవాలు
- పాల్గొని ప్రశంసించిన రాష్ట్ర మంత్రులు



ప్రజల విశ్వాసంతోనే రాష్ట్రంలో సహకార బ్యాంకులు నడుస్తున్నాయని రాష్ట్ర సహకార శాఖ మంత్రి సిహెచ్ ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన నెల్లూరు టౌన్‌హాలులో ది నెల్లూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎటువంటి నిధులు తీసుకోకుండా ప్రజల డిపాజిట్లతోనే వ్యాపారాభివృద్ధి చేసుకుంటూ వాణిజ్య బ్యాంకులకు ధీటుగా అర్బన్ బ్యాంకు దూసుకుపోతుండడం ప్రశంసనీయమన్నారు. ఈ బ్యాంకు అధికారులు, పాలకమండలి రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యశాఖ, వ్యవసాయశాఖ, పశుసంవర్ధక శాఖలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. రైతులు ట్రాక్టర్లు కొనుగోలు చేసుకునేందుకు రుణాలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు కో-ఆపరేటివ్ బ్యాంకు రూ.80కోట్లు డిపాజిట్లు, రూ.50కోట్లు రుణాలు ఇచ్చి రూ.150కోట్లు మూలధనంతో ముందంజలో వుందన్నారు. రాష్ట్రంలోని 38బ్యాంకుల్లో ఆరు బ్యాంకులు మాత్రమే ఇబ్బందుల్లో వున్నాయని, 9బ్యాంకులు వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నాయన్నారు. విశాఖపట్నంలోని సహకార బ్యాంకు ప్రజాదరణలో మంచి పురోగతిలో ఉందని, నెల్లూరు బ్యాంకు కూడా ఆ స్థాయికి చేరుకోవాలన్నారు. జాతీయ సమాఖ్య న్యూఢిల్లీ డైరెక్టర్ ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ఈ బ్యాంకుల్లో ఎన్నికలు నిర్వహించి, పాలకమండలిని ఏర్పాటు చేయాలని సూచించారు. పేద మధ్య తరగతి ప్రజల అవసరాలు తీర్చేందుకు ఈ బ్యాంకులు ఏర్పడ్డాయన్నారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా హైదరాబాదు ఏజిఎం ఎంఎ సాల్మన్ కవిరాజు మాట్లాడుతూ క్రమశిక్షణలో ముందుకు సాగుతున్న బ్యాంకుల్లో నెల్లూరు శాఖ ఒకటని అన్నాడు. ఈ సమావేశంలో బ్యాంకు అధ్యక్షులు జేసియస్ అమర్‌నాథ్, పాలకమండలి సభ్యులు, బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.



# భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి

జిల్లాలో భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ ప్రశాంతిని ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ బంగ్లాలో తెలుగుగంగ, సోమశిల భూసేకరణ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల రెవెన్యూ అధికారులతో సమావేశాలు నిర్వహించి భూసేకరణ పనులు పూర్తి చేయాలన్నారు. భూసేకరణ పనులు పూర్తిచేసి త్వరలో జరుగనున్న సమావేశానికి పూర్తి వివరాలను తీసుకురావాలన్నారు. రాపూరు, సీతారామపురం, దుత్తలూరు ప్రాంతాల్లో అపారా స్టేషన్ కొరకు 706 హెక్టార్ల భూమిని గుర్తించాలన్నారు. భూసేకరణ డిక్లరేషన్ కాలపరిమితి లోపు పూర్తి చేయాలని ల్యాండ్ అక్విజిషన్ అధికారులను ఆదేశించారు. బోరుబావులు వేయడం, చెట్లు నాటించడం, ఉద్యానవన పంటలు వేయించాల్సిందిగా జిల్లా అటవీ అధికారిని ఆదేశించారు. నీరు-చెట్టుకు ప్రతిపాదించిన పనులన్నీ నిబంధనల మేరకు వుండాలన్నారు. అటవీశాఖ, ఉద్యానవన శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖలు అంచనాలతో తయారుచేసిన పనులు, భూసేకరణ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలుగుగంగ ఎస్‌ఇ కె.వి.రమణ, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్నాళ్ళూ... ఏం పొడిచారు?

తెలుగుదేశం ప్రభుత్వం గత మూడు సంవత్సరాలలో ఏ ఒక్క పేదవాడికి కూడా ఒక ఇంటి స్థలం ఇచ్చిన పాపానపోలేదని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 13వతేదీన నెల్లూరు 18వ డివిజన్ పరిధిలోని సర్వేపల్లి కాలువ కట్ట ఏరియాలో అగ్నిప్రమాదం సంభవించి పూర్తిగా కాలిపోయిన ఇంటిని ఆయన సందర్శించారు. బాధిత కుటుంబానికి బియ్యం, బట్టలు, ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 30వేలకు పైగా పేద ప్రజలు సొంత ఇల్లు లేక బాడుగు ఇళ్లలో వుంటున్నారని, ఎన్నికల సమయంలో ఇల్లు లేని పేదలందరికీ 18అంకణాల స్థలం, లక్షా50వేల రూపాయలతో పక్కా ఇళ్ళు కట్టిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 3సంవత్సరాలైనా ఇంతవరకు నగరంలో ఒక్క ఇల్లు కట్టించిన దాఖలాలు లేవన్నారు. నగరంలో ఎన్ని ఇళ్ళు కట్టించారు, ఎవరికిచ్చారో చెప్పాలని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. పేదవాడు సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు అర్జీలు పట్టుకుని ఆశగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి కలలను నిజం చేస్తూ పక్కా ఇళ్ళను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



### సినిమా షూటింగ్‌లకు

# నెల్లూరు అందాలెంతో ఆకర్షణ

### - సినీ హీరో భానుచందర్




సినిమా షూటింగ్‌లకు నెల్లూరులోని ఆహ్లాదకరమైన అందాలు సినిమాల్లో కనువిందు చేసే అవకాశాన్ని సిక్కా(సౌతి ఇండియా సినీ కల్చరల్ అసోసియేషన్) చేరువ చేస్తుందని ప్రముఖ సినీహీరో, సిక్కా సిఇఓ భానుచందర్ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు ఇస్కాన్‌సిటీలోని సిక్కా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో ఇక్కడ కొన్ని సినిమా షూటింగ్‌లు ప్రారంభం కానున్నాయన్నారు. సిక్కా అవార్డుల కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు సాగుతామన్నారు. సిక్కా ఛైర్మెన్ ప్రొఫెసర్ పిఎస్‌రెడ్డి మాట్లాడుతూ అత్యంత ఆధునిక వసతులతో కూడిన సినీ క్లబ్ 5 రాష్ట్రాల సినీ పరిశ్రమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సినీ పరిశ్రమకు కేరాఫ్ అడ్రస్‌గా ఒకప్పుడు చెన్నై ఉండేదని, తర్వాత హైదరాబాద్‌కి మారిందని, ప్రస్తుతం ఏపి సినీ పరిశ్రమకి నెల్లూరు వేదిక కానుందని తెలిపారు. వెంకటాచలం సమీపంలోని కృష్ణపట్నం రోడ్డులో దాదాపు 35వేల చదరపు అడుగుల్లో సినీక్లబ్‌ను ఏర్పాటు చేసామని, ఇందులో ఎన్నో అనువైన లోకేషన్లు ఉన్నాయన్నారు. ఈ నెల 23, 24, 25తేదీలలో సౌత్ ఇండియా డ్యాన్సర్లకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ సినీ దర్శకులు బడిపంతులు, మానవుడు - దానవుడు ఫేం సిక్కా గౌరవాధ్యక్షులు పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కోట్ల రూపాయల వ్యయంతో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన ఈ సినీక్లబ్ సినీ పరిశ్రమకు కేరాఫ్‌గా మారనుందన్నారు. నటీనటులకు ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని సిక్కా ఛైర్మెన్ పి.ఎస్.రెడ్డిని అభినందించారు. అనంతరం కృష్ణపట్నం రోడ్డులోని సిక్కా సినీక్లబ్‌ను విక్రమ సింహపురి యూనివర్శిటి వైస్‌ఛాన్సలర్ వీరయ్యతో కలసి వీరు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కన్నడ సినిమా దర్శకుడు మస్కలమట్టి మంజునాథ్, సిక్కా ఉపాధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, మీడియా మేనేజర్ నరేష్‌కుమార్, ఏపి డిస్ట్రిబ్యూటర్స్ వింగ్ అధ్యక్షులు ద్రోణాదుల వెంకట్రావు పాల్గొన్నారు.

# కోటంరెడ్డికి సత్కారం



నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మెన్‌గా ఎన్నికైన కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిని ఈనెల 11వతేదీన నగరంలోని 11, 18డివిజన్‌లకు చెందిన కార్యకర్తలు స్థానిక నాయకులు ఆర్.శ్రీనివాసులు(ఆర్ఎస్ఆర్) ఆధ్వర్యంలో ఆయన ఇంటిలో కలిసి ఘనంగా సత్కరించారు. అలాగే నుడా డైరెక్టర్‌గా నియమించబడ్డ షేక్ ఖాజావలిని కూడా ఆయన ఇంటికెళ్లి సత్కరించారు. ఈ కార్యక్రమంలో చాంద్‌బాషా, ఎం.శ్రీనివాసులు, కృపారావు, భరత్, రూపేష్, చిట్టి, శేఖర్, నాదముని, అనిల్, రంజిత్, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

## 17న విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

నెల్లూరులోని రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం(టౌన్‌హాలు ట్రస్ట్ బోర్డు) వారు నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను ప్రతి సంవత్సరం అందజేస్తున్న విషయం విధితమే. ఈ ఏడాది కూడా 2016-17లో కార్పొరేషన్ పరిధిలోని 35 మున్సిపల్, జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలల్లో ప్రథమ స్థానం సాధించిన 45మంది విద్యార్థులకు రూ.5వేలు నగదు ప్రోత్సాహక బహుమతి, ప్రశంసాపత్రాన్ని ఈ నెల 17వ తేదీ శనివారం సాయంత్రం 4గంటలకు టౌన్‌హాలులో ప్రదానం చేయనున్నట్లు టౌన్‌హాల్ ట్రస్ట్‌బోర్డు కార్యదర్శి జె.ఎస్.రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం పాల్గొంటున్నారని తెలిపారు.

# ప్రాంతీయ వైద్యశాలలో ఎమ్మెల్యే

గూడూరు ప్రాంతీయ వైద్యశాలను సోమవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తనిఖీ చేశారు. తొలుత ఎమ్మెల్యే అత్యవసర చికిత్సలు అందించే వార్డును, ఆపరేషన్ గది, సిటీ స్కానింగ్ గది, రక్త పరీక్షల గది, వార్డులు, డ్రైనేజీ కాలువలు, బాలింతల గదులు, తాగునీటికి ఆర్‌వో ప్లాంట్ తదితరాలను పరిశీలించి, అక్కడ వున్న సమస్యలపై ఆసుపత్రికి వచ్చిన రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఎక్కడా నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో నెలరోజులుగా కొనుగోలు చేసుకుని దాహం తీర్చుకొంటున్నట్లు రోగులు చెప్పారు. బ్లడ్‌బ్యాంకులో రక్తం లేకపోవడంతో రోగులు అనేక తిప్పలు పడుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ సూపరింటెండెంట్, కమిటీ సభ్యులు పట్టించుకోకపోవడం దారుణమని, మరోసారి ఇలా జరిగితే ఊరుకోనంటూ మందలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, తెలుగుదేశం గూడూరు మండల అధ్యక్షులు కొండూరు వెంకటేశ్వరరాజు, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉమ, ఆర్ఎంవో శైలజ, డాక్టర్ రాజా, అభివృద్ధి కమిటీ సభ్యులు, ఎస్సై అన్నంగి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## గూడూరు డివిజన్ వార్తలు

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి



వృత్తి శిక్షణ తరగతుల సర్టిఫికేట్ ఇస్తున్న డా॥ సి.రోహిణి, వై.స్నేహలతారెడ్డి, సౌందర్యమ్మ తదితరులు

మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ఉపాధి శిక్షణను ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల ద్వారా ఇస్తున్నామని ఆంధ్ర మహిళామండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి తెలిపారు. గూడూరు పట్టణంలోని ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి వృత్తి శిక్షణ తరగతులకు హాజరైన మహిళలకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. పట్టణానికి చెందిన భువనేశ్వరి అనే విద్యార్థికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో రూ.5,000 విలువైన పుస్తకాలు కొనుగోలు నిమిత్తం అందించారు. గూడూరు చిన్న కుమ్మరవీధికి చెందిన శీనయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న సందర్భంగా ఆయన కుటుంబసభ్యులకు 10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి అధ్యక్షురాలు సౌందర్యమ్మ, సభ్యులు డాక్టర్ లక్ష్మి, ఎల్లసిరి లక్ష్మి, రమా, ప్రభారెడ్డి, జీవని, సీతారెడ్డి, విష్ణువందన, శ్రీలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, పిఎంరావు తదితరులు పాల్గొన్నారు.

## తపాలా శాఖ ఏటిఎం సేవలు ఉచితం



తపాలాశాఖలో కేవలం రూ.100 చెల్లించి సేవింగ్స్ ఖాతా పొందవచ్చని తపాలా శాఖ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన రాజు తెలిపారు. గూడూరు పట్టణంలోని తపాలా కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ తపాలా ఉద్యోగులందరితో కలసి ప్రజలకు చక్కటి సేవలను అందిస్తామని తెలిపారు. తపాలా సేవింగ్స్ ఖాతా ద్వారా ఏటిఎం సేవలను ఉచితంగా పొందవచ్చునని చెప్పారు. ఏటిఎం కార్డు ద్వారా ఇతర బ్యాంకింగ్ ఏటిఎంలలో నెలకు 5సార్లు ఉచితంగా నగదు పొందవచ్చునని, దేశంలో ఏ తపాలాశాఖ ఏటిఎంలలో ఎన్నిసార్లయినా ఏటిఎంను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఎలాంటి వార్షిక రుసుములు, ఎస్ఎంఎస్ ఛార్జీలు ఉండవని, ఈ అవకాశాన్ని ప్రస్తుత సేవింగ్స్ ఖాతాదారులు కూడా పొందవచ్చునని తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన రాజును తపాలాశాఖ సిబ్బంది సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారి రమణయ్య, ఉద్యోగులు ఉన్నారు.

### వెంకటేశ్వరునికి

## వైభవంగా వసంతోత్సవం

గూడూరు పట్టణంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి సోమవారం వసంతోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం చక్రస్నానం, పూర్ణాహుతి తదితర విశేష పూజలను వేదపండితులు వేదమంత్రోచ్ఛారణలతో ఘనంగా నిర్వహించారు. రాత్రి ధ్వజావరోహణాన్ని చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉభయదాతలుగా గమిడి శ్రీనివాసులు, విజయలక్ష్మి, అనుమకొండ శ్రీనివాసులు, సురేఖ, దుగ్గిశెట్టి కోటేశ్వరరావు, శారదమ్మ, కొప్పర్తి వెంకటరత్నయ్య, రాజేశ్వరమ్మ తదితరులు వ్యవహరించారు.

### నిబంధనలు

## అతిక్రమిస్తే చర్యలు

### - డీటీసీ శివప్రసాద్



నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని జిల్లా రవాణా శాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు. పోటుపాళెం పరిధిలోని రవాణాశాఖ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల వాహనాలకు సామర్థ్య ధ్రువపత్రాలు(ఎఫ్‌సీ), లైసెన్సులు లేకుండా నడిపితే కఠినంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. లారీలు అధిక లోడుతో ప్రయాణిస్తే సీజ్ చేస్తామని తెలిపారు. అనంతరం పలు వాహనాల సామర్థ్యాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ జకీర్, ఏవో మదానీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీను గల్పిక

# అసెంబ్లీలో పడవలతో ఆట

ఉండవల్లిలోని హైటెక్‌రత్న, సింగపూర్ సింహ్ చంద్రబాబు నివాసం. మనువడు దేవాన్ష్‌తో చంద్రబాబు బూచి ఆట ఆడుకుంటున్నాడు. వాళ్ళ ఆనందానికి అడ్డుకట్ట వేస్తూ అప్పుడే అక్కడకు స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు, మంత్రులు కె.ఇ.కృష్ణమూర్తి, పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పత్తిపాటి పుల్లారావు, పరిటాల సునీతలు వచ్చారు. వాళ్ళ ముఖాలు సీరియస్‌గా వున్నాయి. అందరిలోనూ టెన్షన్ వుంది. వాళ్లను చూసి చంద్రబాబు ఏంటలా వున్నారని అడిగాడు. కోడెల రొప్పుతూ... అవతల మన పరువు పోతుంటే ఇక్కడ మీరు తీరిగ్గా బూచి ఆట ఆడుకుంటున్నారా? అని ఆవేశంగా అన్నాడు. ఏమైందని చంద్రబాబు అడిగాడు. ముందు టీవీ ఆన్ చేసి 'ఆత్మసాక్షి' ఛానెల్ పెట్టండి, ఏమైందో మీకే తెలుస్తుందని కోడెల ఇంకా ఆవేశంగా చెప్పాడు. కోడెల నోటి నుండి ఆ మాటను విన్న వెంటనే కంప్యూటర్ బ్రైన్ కలిగిన దేవాన్ష్ అక్కడే వున్న రిమోట్ తీసుకుని టీవీ ఆన్ చేసి నెంబర్లు నొక్కి 'ఆత్మసాక్షి' ఛానెల్ పెట్టేసాడు. ఆ బుడతుడు చేసిన పనికి అందరూ ఆశ్చర్యపోతూ... ఇతను తాతను మించే మనువడు కాదు తాతను ముంచే మనుమడు అవుతాడని మనసులో అనుకున్నారు. 'ఆత్మసాక్షి' ఛానెల్‌లో వెలగపూడిలోని అసెంబ్లీ, సచివాలయం భవనాలను చూపిస్తున్నారు. కొద్దిపాటి వర్షానికే ఉరుస్తున్న అసెంబ్లీ సచివాలయం, ప్రతిపక్ష నేత ఛాంబర్‌లోకి నీళ్లు, అసెంబ్లీ జలమయం... రాజధాని రోడ్లపై పడవల్లో తిరుగుతున్న ఎమ్మెల్యేలు... అంటూ యాంకర్ స్వప్న అసెంబ్లీ హాల్‌లో గొడుగు వేసుకుని తిరుగుతూ చెబుతోంది. అప్పుడే అక్కడకు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆర్.కె. రోజా, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్‌లు చేరుకున్నారు. ప్రతిపక్ష నేత జగన్ ఛాంబర్‌లో నీళ్లలో కాగితాల పడవలను వదిలి ఆడుకోసాగారు. ఆత్మసాక్షి ఛానెల్ రిపోర్టర్ దానిని షూట్ చేస్తుండగా యాంకర్ స్వప్న... చంద్రబాబు ఘోషించిన సింగపూర్ టెక్నాలజీ ఇదేనేమో... నిన్నగాక మొన్న కట్టిన సచివాలయంలో అప్పుడే పగుళ్లు... ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో నీళ్ళు... ఆ నీళ్ళలో కాగితం పడవలతో ఆడుకుంటున్న ఎమ్మెల్యేలు... సింగపూర్ అసెంబ్లీ కూడా ఇలాగే ఉంటుందా? అక్కడ ప్రజాప్రతినిధులు కూడా ఇలాగే ఆడుకుంటారా? ఇన్ని వందల కోట్లు తగలేసి ఈ భవనాలు కట్టింది నీళ్లలో కాగితం పడవలు తిప్పుకోవడానికేనా? అని ఆవేశంగా ప్రశ్నించింది. 'ఆత్మసాక్షి' ఛానెల్‌లో... అసెంబ్లీ, సచివాలయాలలో కుండపోత దృశ్యాలను చెన్నై, కర్నూలు వరదల కంటే భయంకరంగా ప్రసారం చేయసాగారు. ఆ దృశ్యాలను చూస్తుంటే చంద్రబాబుకు చిర్రెత్తుకొచ్చింది. తాత ముఖంలో ఫీలింగ్స్ గమనించిన దేవాన్ష్ వెంటనే రిమోట్‌తో టీవీ ఆఫ్ చేసేసాడు. అప్పుడే పై అంతస్థులో నుండి లోకేష్ హాల్‌లోకి వచ్చాడు. లోకేష్‌ను చూడగానే పత్తిపాటి పుల్లారావు... చూసావా బాబు ఆ ఆత్మసాక్షి టీవీ వాడు ఎంత ఘోరంగా చూపిస్తున్నాడో... కొద్దిపాటి వర్షానికే సచివాలయం ఉరుస్తుందంటా... బిల్డింగ్‌లన్నాక నీళ్ళు కారకుండా ఉంటాయా? అడుగుకు కేవలం 10వేల రూపాయలే ఖర్చుపెట్టి కట్టాం... అంతకంటే నాణ్యంగా భవనాలు కావాలంటే ఎట్లా వస్తాయని బాధపడ్డాడు. అది విని లోకేష్... నేను పైన టీవీలో అంతా చూసాను, జరిగిందంతా కూడా మన మంచికే జరిగింది. వర్షాకాలంలో సచివాలయం, అసెంబ్లీ భవనాలను టార్పాలిన్ పట్టలతో కప్పి ఉంచుదాం, అలాగే ఈ రెండు భవనాలలో ఉరుస్తున్న చోట్ల నీటిని పట్టేందుకు పదివేల బకెట్లు కొందాం. వీటికి ఒక వంద కోట్లు మంజూరు చేస్తే సరి... మనోళ్లకు కూడా పని కల్పించినట్లుంటుందన్నాడు. లోకేష్ ఆలోచనకు అందరూ ఆశ్చర్యపోయారు. అంతా విన్న చంద్రబాబు... ముందు అక్కడకు వెళ్ళి పరిస్థితిని చూద్దాం పదండి... అంటూ బయటకొచ్చాడు. అక్కడ కాన్వాయ్‌లో కార్లకు బదులు పడవలున్నాయి. ఏంటివి అని చంద్రబాబు అడిగాడు. మనమిప్పుడు సచివాలయం వద్దకు పోవాలంటే ఇవే గతి అని సోమిరెడ్డి చెప్పాడు. దాంతో అందరూ నాలుగు పడవల్లో తెడ్లు వేసుకుంటూ సచివాలయం వద్దకు చేరుకున్నారు. చంద్రబాబు అసెంబ్లీ సచివాలయాన్ని చూసొచ్చాడు. వర్షపు నీళ్ళు ఎక్కడ కారుతున్నాయి, ఎక్కడ కారడం లేదన్నది పరిశీలనగా చూసొచ్చాడు. చంద్రబాబు బయటకు రాగానే మీడియా వాళ్లు చుట్టుముట్టేసారు. అసెంబ్లీలో కుండపోతపై మీ సమాధానం ఏంటంటూ కుండబద్దలు కొట్టినట్లు అడిగారు. చంద్రబాబు ఆవేశంగా... ఆ సింగపూర్ కంపెనీ వాళ్ళను పిలవండి అని ఆదేశించాడు. వెంటనే సింగపూర్ మంత్రి ఈశ్వరన్ మీడియా ముందుకు వచ్చాడు. ఇందులో చంద్రబాబు గారి తప్పేమీ లేదు. మేము వర్షాలను దృష్టిలో పెట్టుకుని బిల్డింగ్‌లు కట్టలేదు. చంద్రబాబు సీఎంగా వుంటే వర్షాలు పడవని చాలా మంది అంటుంటే మేం దానిని నిజమనుకున్నాం. కానీ, ఇలా ఉన్న ఫళంగా వర్షం వస్తుందనుకోలేదు. వెంటనే వీటిని పడగొట్టి కొత్తవి కడతాం. కాకపోతే ఈసారి అడుగుకు 15వేలిస్తే సరిపోతుందని చెప్పాడు. అప్పుడే అక్కడకు యువరత్న బాలకృష్ణ వచ్చాడు. ఏంది గోల... ఏంది ఈ గొడవంతా అని అడిగాడు. వర్షం వల్ల వచ్చిన తలనొప్పి అని చంద్రబాబు చెప్పాడు. అప్పుడు బాలయ్య... ఓస్ అంతేనా? నేను గట్టిగా తొడ కొడితే వచ్చే వర్షం కూడా మధ్యలోనే ఆగిపోతుందన్నాడు. వెంటనే నారాయణ అతని చేతిని గట్టిగా పట్టుకుని... బాబూ... మీరు తొడ కొడితే వర్షం ఆగితే ఫర్వాలేదు... కాని ఆ సౌండ్‌కు అంతంత మాత్రంగా కట్టిన ఈ భవనాలు కూలిపోతే మీ బావగారు తలను సింగపూర్ సముద్రంలో దించుకోవాల్సిందే అని బ్రతిమలాడుకోసాగాడు.

---

## మేషం

అశ్వని, భరణి, కృతిక 1 పాదము

కళా క్రీడా శాస్త్ర సాంకేతిక రంగాలవారికి ప్రోత్సాహకరంగా వుంటుంది. ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. సభలు, సమావేశాలు, శుభకార్యాలలో పాల్గొంటారు. పెద్ద మొత్తాలలో పెట్టుబడులు, కొనుగోళ్ళు, ఆర్థిక లావాదేవీలు చేయవద్దు. ఆర్థికపరమైన ఇబ్బందులుండినను ఆదాయ లోపం రాదు. కుటుంబపరమగు సమస్యల నుండి బయటపడతారు.

## వృషభం

కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

దూరప్రయాణాలు ఖరారు కాలవు. పనులందు వత్తిడి ఎక్కువగా వుంటుంది. నిర్మాణాలు, కాంట్రాక్టు పనులు నిదానంగా సాగుతాయి. శుభకార్యాలలో పాల్గొంటారు. అధికారులకు స్థాన మార్పు, ఉద్యోగులకు బాధ్యతల భారం పెరుగుతుంది. విద్యావకాశాలు లభించగలవు. ఆశించినంత ఆదాయం వుండదు. పలు రకాలుగా ఖర్చుల భారం పెరుగుతుంది.

## మిధునం

మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వ్యాపార వృద్ధికి అవకాశాలు లభిస్తాయి. ఆదాయం సంతృప్తికరం. ఉద్యోగులకు అధికారవర్గం నుండి సహాయ సహకారాలు వుంటాయి. ఉన్నత విద్యావకాశాలు, దూర ప్రయాణాలుంటాయి. శుభకార్యాలు నిర్ణయం కావడం, ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశం దొరకడం, కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. స్థిరాస్తుల మీద ఆదాయం వుంటుంది.

## కర్కాటకం

పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

దూరప్రయాణాలు చేసేవారు శ్రమపడతారు. న్యాయ, వైద్య రంగాల వారికి అభివృద్ధి వుంటుంది. ఉద్యోగ నిర్వహణ సమస్యలను దాటుకుంటారు. వాహనాలు నడిపేవారు జాగ్రత్త. విద్యావకాశాలు బాగుంటాయి. అనుకున్న పనులు నెరవేరుతాయి. మీ సూచనలు, సలహాలు అందరూ ఆమోదిస్తారు. సోదరుల కుటుంబాలకు మేలు జరుగుతుంది.

## సింహం

మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తిలో ఇబ్బదులను అధిగమించగలరు. అవసరం లేని హామీలు, రుణాలు ఇవ్వవద్దు. ఉద్యోగావకాశాలు లభించవచ్చు. శుభకార్యాలలో పాల్గొంటారు. బంధుమిత్రులను కలుసుకుంటారు. గృహోపకరణాలు కొత్తవి కొంటారు. విద్యావకాశాలు బాగుంటాయి. చేసే పనిలో ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా వుండి ఇతరులు సహాయ పడతారు. అయితే, వత్తిడి ఎక్కువగా వుంటుంది.

## కన్య

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

నిర్మాణాలు, రిపేర్ల వంటివి చేపడతారు. కొత్త ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అధికారులకు స్థాన మార్పు మరియు అదనపు బాధ్యతలుంటాయి. అనుకున్న పనులు సమర్థవంతంగా నిర్వహిస్తారు. బంధువర్గంతో విభేదాలుంటే సర్దుబాటు కాగల అవకాశాలున్నవి. విద్యావృద్ధి అవకాశాలున్నాయి. ఆర్థికంగా బాగుండి, ఆదాయం పెరుగుతుంది.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 16.6.2017 నుండి
తేది. 22.6.2017 వరకు

ఈ వారం మేషంలో శుక్రుడు, మిధునంలో రవి, కుజ, బుధులు, సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో శని, 20వ తేదీ నుండి వృశ్చికంలో వక్రగతిలో శని, కుంభంలో కేతువు, కుంభ మీన మేష వృషభ రాశుల్లో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము

### ముహూర్తములు

తేది 18 ఆదివారము ఉదయం గంట 7.46 నుండి గంట 9.56లోగా కర్కాటక లగ్నమున వ్యాపార ఉపనయన వివాహ, కేశఖండన, అక్షరాభ్యాస అన్నప్రాశనలు.

### జ్యేష్ఠ మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 16 | శుక్ర | సప్తమి | రా॥ గం.12.21వ॥ |
| తేది. 17 | శని | అష్టమి | రా॥ గం.11.27వ॥ |
| తేది. 18 | ఆది | నవమి | రా॥ గం.10.10వ॥ |
| తేది. 19 | సోమ | దశమి | రా॥ గం.8.26వ॥ |
| తేది. 20 | మంగళ | ఏకాదశి | రా॥ గం. 6.30వ॥ |
| తేది. 21 | బుధ | ద్వాదశి | సా॥ గం.4.15వ॥ |
| తేది. 22 | గురు | త్రయోదశి | ప॥ గం.1.52వ॥ |

## తుల

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

శుభకార్యాలు నిర్ణయం కావడం, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. దూరప్రయాణాల్లో శ్రమపడతారు. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా వుంటాయి. పిల్లలతో సమస్యలు రావచ్చును. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. మీ ఆలోచనలు, పథకాలు అమలు చేయడానికి మంచి సమయం. కొత్త వ్యాపారాలు, కొత్త పెట్టుబడులకు అవకాశాలున్నవి.

## వృశ్చికం

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

విద్యావకాశాలు బాగుంటాయి. ఆరోగ్యవిషయంలో జాగ్రత్త అవసరం. అధికారులకు స్థాన మార్పు, ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. శుభకార్యాలలో పాల్గొంటారు. వ్యవహారాలను జాగ్రత్తగా నడపండి. బంధువుల వల్ల ఇబ్బందులు రావచ్చును. వస్తు, వాహన, గృహ రిపేర్ల ఖర్చులు, అనుకోని అదనపు ఖర్చులుంటాయి.

## ధనుస్సు

మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

శుభకార్యాలలో పాల్గొంటారు. ఉన్నత విద్యావకాశాలు లభించును. రావలసిన బాకీలు వాయిదా పడతాయి. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్త వహించాలి. దూరప్రయాణాలుంటాయి. చేపట్టిన పనులందు చిన్న ఆటంకాలు వచ్చినా అనుకూలంగా నెరవేరుతాయి. తొందరపాటు నిర్ణయాలు, తొందరపాటు సంభాషణలు చేయకండి. కొత్త వ్యాపారాలను సంకల్పిస్తారు.

## మకరం

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

అధికారులకు స్థాన మార్పు. ఉద్యోగులకు అదనపు పనిభారం వుంటుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. దూర ప్రయాణాలుంటాయి. షేర్లు, స్థిరాస్తులు, పెట్టుబడులపై ఆదాయం వుంటుంది. సభలు, సమావేశాల్లో ప్రముఖంగా వ్యవహరిస్తారు. విద్యావకాశాలు బాగుంటాయి. అవసరాలేవైననూ కొంత రుణం చేస్తారు. స్థిరాస్తుల లావాదేవీలను వాయిదా వేసికొనడం మంచిది.

## కుంభం

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

నిర్మాణాలు, కొత్త కాంట్రాక్ట్ పనులు చేపడతారు. శుభకార్యాలలో పాల్గొనడం, దూర ప్రయాణాలుంటాయి. ప్రభుత్వ అనుమతులు, రుణాలు లభించగలవు. విద్యావకాశాలు బాగుంటాయి. ఆరోగ్యం ఫరవాలేదు. ఉద్యోగులకు ఆదరాభిమానాలు వుంటాయి. డబ్బు, వస్తువులు జాగ్రత్తపరచుకోండి. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతున్నా వత్తిడి ఎక్కువగా వుంటుంది.

## మీనం

పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులకు అధికారుల ఆదరణ అనుకూలత బావుంటుంది. కొన్ని స్థిరమైన కుటుంబ నిర్ణయాలు తీసుకొంటారు. ఉద్యోగావకాశాలు లభించగలవు. ఆరోగ్యం బాగుంటుంది. కోర్టు కేసులందు అనుకూలత, బాకీలు కొంత లభించుట జరుగుతుంది. ఆర్థిక స్థితి బాగుంది. వృత్తి, వ్యాపారాలలో మంచి అవకాశాలు లభించగలవు. ఆదాయం పెరుగుతుంది.

# ఏసిబి డిఎస్పీగా పరమేశ్వరరెడ్డి



- అవినీతిపరుల పాలిట సింహస్వప్నం తోట ప్రభాకర్ ఒంగోలుకు బదిలీ
- లంచగొండుల తాట వలుస్తానంటున్న కొత్త డిఎస్పి

నెల్లూరు అవినీతి నిరోధకశాఖ డిఎస్పీగా పోతన్నగారి పరమేశ్వరరెడ్డి ఈ నెల 10వ తేదీన నెల్లూరులోని ఏసిబి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. విజయవాడ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌లో డిఎస్పీగా పనిచేస్తూ ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. అనంతపురం జిల్లాకు చెందిన పరమేశ్వరరెడ్డి ఉద్యోగ ప్రయాణం మొదలైంది కూడా నెల్లూరు జిల్లాలోనే కావడం గమనార్హం. 2010లో పోలీస్‌శాఖలో చేరిన ఆయన 2011లో ఏడాది పాటు గూడూరులో ట్రైనీ డిఎస్పీగా పనిచేసారు. 2012లో గుడివాడ డిఎస్పీగా, 2013లో కరీంనగర్ జిల్లా జగిత్యాల డిఎస్పీగా పని చేశారు. 2014-15లలో తెలంగాణ రాష్ట్రంలో సిఐడి డిఎస్పీగా బాధ్యతలు నిర్వహించారు. 2016లో ఆయనను ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించగా, 2017 ఫిబ్రవరి నుండి విజయవాడలో వున్న సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌లో డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. నెల్లూరు ఏసిబి డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వశాఖల్లో అవినీతి అంతు తేల్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కొందరు అవినీతిపరుల వల్ల వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం పోతుందని, లంచం ఇవ్వనిదే ఏ పనీ జరగదనే అపోహ పెరిగిపోయిందన్నారు. తమను లంచం అడిగిన ప్రభుత్వ ఉద్యోగులను ప్రజలు నిలదీయాలని, లంచం కోసం పీడిస్తే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు. అవినీతిపరులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అవినీతికి పాల్పడితే జైలుకు పంపడం తథ్యమని ఆయన ఘాటుగానే హెచ్చరించారు. ఇప్పటి వరకు అవినీతి కేసుల్లో పట్టుబడ్డ వారిపైనే కేసులు నమోదు చేస్తున్నామని, ఇకముందు క్రింది స్థాయి ఉద్యోగి అవినీతికి పాల్పడినా వారి పైఅధికారులపై కూడా కేసులు నమోదు చేస్తా మన్నారు. అధికారులకు తెలియకుండా క్రిందిస్థాయి ఉద్యోగులు లంచాలు తీసుకునేంత ధైర్యం చేయలేరని, క్రిందిస్థాయి ఉద్యోగులు తీసుకునే లంచాల్లో అధికారులకు వాటా ఉంటుందన్న విషయం చాలా సంఘటనల్లో ఋజువైందన్నారు. వేలకువేలు జీతాలు తీసుకుంటూ, ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాలు పొందుతూ లంచాల కోసం ప్రజల్ని పీక్కుతినే వాళ్లను జైళ్లకు పంపడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. ఏ క్షణంలో అయినా తమకు అవినీతిపరుల సమాచారం అందించవచ్చని, ఫిర్యాదులు చేయడానికి డిఎస్పీ సెల్. 9440446184, సిఐలు 94404 46185, 94404 46186, ఏసిబి ఆఫీసు 0861-2331833 నెంబర్లకు ఫోన్ చేసి తెలుపవచ్చని ఆయన వెల్లడించారు.

వివిఎస్ఆర్ చౌదరి, తోట ప్రభాకర్‌లాంటి ఏసిబి డిఎస్పీలు నెల్లూరుజిల్లాలో అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. ఎన్నో అవినీతి తిమింగలాలను పట్టుకున్నారు. పరమేశ్వరరెడ్డి కూడా అదే చొరవ, అదే స్ఫూర్తితో అవినీతిపరుల పాలిట అంకుశం కావాలని 'లాయర్' ఆకాంక్షిస్తోంది.



# తొలి మునిసిపల్ కాలేజీ మనదే!

**- మంత్రి పి.నారాయణ**

రాష్ట్రంలోనే తొలిసారిగా నెల్లూరులో మునిసిపల్‌శాఖ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల ప్రారంభించామని, ఇక్కడ వచ్చిన ఫలితాలను సరిచూసుకున్నాక దానిని బట్టి రాష్ట్రమంతటా ఇలాంటి కళాశాలలు ప్రారంభిస్తామని రాష్ట్ర మునిసిపల్‌శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. చిత్తశుద్ధి, అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించినప్పుడే విద్యావ్యవస్థ లక్ష్యం నెరవేరుతుందన్నారు. నెల్లూరులోని వివిఆర్ కళాశాలలో బుధవారం మంత్రి నారాయణ మునిసిపల్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత విద్యలో మంచి ఫలితాలు సాధించాలంటే నర్సరీ స్థాయి నుంచే మంచి పునాదులు వుండాలన్నారు. అభివృద్ధికి విద్యే మూలమనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభిప్రాయానికి అనుగుణంగా విద్యారంగంలో సంస్కరణలు చేపట్టారన్నారు. గతంలో గుంటూరులో బ్రిడ్జికోర్సులు, ఫౌండేషన్ కోర్సులు ప్రారంభించాలంటే కొన్ని సంఘాలు వ్యతిరేకత కనపరిచాయని, అయితే వాటివల్ల కలిగిన ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని వారు ఇప్పుడు వాటిని ప్రోత్సహిస్తున్నారని అన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన నెల్లూరు నగర మేయర్ షేక్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ స్కూళ్ళ అభివృద్ధికి జిల్లా కలెక్టర్, మునిసిపల్‌శాఖ అధికారులు చేస్తున్న కృషిని కొనియాడారు. జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు మాట్లాడుతూ, నూతనంగా ఇప్పుడు ఏర్పాటుచేసిన ఈ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల అభివృద్ధికి తమ తోడ్పాటును అందిస్తామన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్‌శాఖ కమిషనర్ కన్నబాబు, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, చాట్ల నరసింహారావు, నగరపాలకసంస్థ కమిషనర్ ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

# కమనీయం శ్రీవారి కళ్యాణం



శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం 8గంటలకు నెల్లూరు టిటిడి కళ్యాణ మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్, హిందూ ధర్మ ప్రచార మండలి ఆధ్వర్యంలో శ్రీవారి కళ్యాణం కమనీయంగా జరిగింది. తొలుత శ్రీదేవి, భూదేవి, శ్రీనివాసుని ఉత్సవ విగ్రహాలకు తిరుమంజనం, అభిషేకాలను వేదపండి తులు నారాయణ దాశరధిస్వామి, వేదగిరి ఫణిశర్మలు వేద మంత్రోచ్ఛారణలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం 9గంటలకు కొత్తగా బడిలో చేరు విద్యార్థినీ విద్యార్థుల కోసం సరస్వతిపూజ, సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించి పిల్లలందరికీ స్వామివారి పాదాల చెంత వుంచిన పలకలను ఇచ్చి అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. తదుపరి హోమం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి, శ్రీనివాసునికి దివ్యాభరణములు అలంకరించి వేదమంత్రోచ్ఛారణలతో, మంగళవాయిద్యాలతో, భక్తుల గోవిందనామ స్మరణలతో స్వామివారి కళ్యాణోత్సవం తిరుమల సాంప్రదాయ ప్రకారం కమనీయంగా సాగింది. కళ్యాణం అనంతరం స్వామివారికి 9రకాల పుష్పాలతో పుష్ప యాగం జరిగింది. అన్నమాచార్య బిరుదాంకితులు గుండాల గురవయ్య ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తులను ఆకట్టు కున్నాయి. కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు శ్రీవారి దివ్య ప్రసాదం లడ్డూలను, శ్రీవారి పాదపద్మముల వద్ద వుంచిన కంకణములు, కళ్యాణ తలంబ్రాలను అన్నప్రసాదములు పంపిణీ చేశారు. హిందూధర్మ ప్రచార పరిషత్, హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

# 'స్పిరిలినా'లో విటమిన్లు పుష్కలం

**- సినీ నటి గీతాసింగ్**



మన శరీరానికి అవసర మైన ప్రొటీన్లు, విటమిన్లు 'స్పిరిలినా' పౌడర్‌లో పుష్కలంగా వున్నాయని, అంతేకాకుండా రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకు దోహద పడుతుందని సినీ హాస్య నటి గీతాసింగ్ తెలిపారు. ఈ నెల 12వ తేదీన నెల్లూరులోని ఓ హోటల్‌లో ఆమె లైఫ్‌సోల్ వారి 'స్పిరిలినా' సహజ పోషక ప్రొటీన్ ఆహారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సంస్థ అధినేత శింగంశెట్టి అభిషేక్ మాట్లాడుతూ కువైట్‌లో శిక్షణ పొంది స్వంత క్షేత్రంలోనే 'స్పిరిలినా' పౌడర్‌ను తయారుచేసి అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో ముందుకు సాగుతున్నామన్నారు. టివి ఆర్టిస్టు శింగంశెట్టి మురళీ మోహన్‌రావు, ఖాదర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.




ఇటీవల నెల్లూరులోని వివిఆర్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో జరిగిన ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ జనరల్‌బాడీ సమావేశంలో ప్రసంగిస్తున్న వివిఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి, వాకర్స్ మాజీ గవర్నర్ ఎం.వి.సుబ్బారెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి వి.నాగేశ్వరరావు, కోశాధికారి టి.వెంకటేశ్వర్లు తదితరులు

# సినారెకు నెరసం సంతాపం

ప్రముఖ సాహితీవేత్త, సినీ గేయరచయిత, జ్ఞానపీఠ్ అవార్డ్ గ్రహీత సింగిరెడ్డి నారాయణరెడ్డి(సినారె) మృతి పట్ల నెల్లూరుజిల్లా రచయితల సంఘం సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా నెరసం జిల్లా అధ్యక్షులు ఎ.జయప్రకాష్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో నారాయణరెడ్డిది మరువలేని పాత్ర అని అన్నారు. సినీగేయ రచయితగా 3వేలకు పైగా పాటలు వ్రాసిన ఆయనకు రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది అభిమానులున్నారని తెలిపారు. తెలుగు సాహిత్యం, తెలుగు భాష ఉన్నంత వరకు సినారె ఉంటారన్నారు. ఆయన అసమాన ప్రతిభకు ప్రభుత్వ పద్మశ్రీ, పద్మభూషణ్ లాంటి అనేక పురస్కారాలు అందించి సత్కరించిందని తెలిపారు. ఆయన మృతి సాహితీలోకానికే కాదు, యావత్తు తెలుగుజాతికి తీరని లోటన్నారు.

# జర్నలిస్ట్ పిల్లలకు ప్రతిభా పురస్కారాలు




ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతిలో 2017వ సంవత్సరంలో 9.5 జిపిఏ కంటే ఎక్కువ పాయింట్లు సాధించిన అక్రిడిటేషన్ కలిగి నెల్లూరుజిల్లాలో పని చేస్తున్న ఎడిటర్లు, జర్నలిస్టుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలతో పాటు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పొన్నపూడి తాతారావు, ఉడతా రామకృష్ణ నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈనెల 30వతేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని, ఇతర వివరాలకు 88012 33806, 94405 89430 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.



# దివికేగిన కవి దిగ్గజం

(మొదటి పేజీ తరువాయి)

పాటకు పల్లవి ప్రాణమైతే..పల్లవికి గీతమే ప్రాణం. ప్రతి అక్షరంలోనూ, ప్రతి పదంలోనూ ఎనలేని మాధుర్యాన్ని నింపి..గీతాన్ని మనోహర సంగీతంలా ఇంపుగా.. వినసొంపుగా రచించగలిగే విశిష్ట కవితారీతి ఆయన సొంతం. ఆయన మరెవరో కాదు...డా. సి.నారాయణరెడ్డి. ఆయనకు సాహిత్యమంటే ప్రాణం. కవిత్వమంటే మరెంతో ఇష్టం. అందుకే, 'కవిత నా శ్వాస..కవిత్వం నా మాతృభాష'..అని ఎంతో ధీమాగా ప్రకటించుకున్న ధీరగంభీర కవి ఆయన. తెలుగు కవిత్వానికి ఆయనో కొత్త ఒరవడిని దిద్దారు. తెలుగుపాటకు సరికొత్త నడకలు నేర్పారు. తెలుగు భాషకు పట్టం కట్టి..తెలుగు పాటకు పట్టాభిషేకం చేసిన తెలుగు వెలుగుల కీర్తిమూర్తి, కవితా వైతాళికుడు..సాహితీ తపస్వి..అక్షరయోధుడు డా. సి.నారాయణరెడ్డి. కవిగా, అధ్యాపకునిగా, వక్తగా, సాహితీవేత్తగా, సినీ గీత రచయితగా, సారస్వతలోకంలో అత్యున్నతమైన జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతగా ఎంతో ప్రజ్ఞాపాటవాలతో ఆయన ఎన్నో సమున్నత శిఖరాలనందుకున్నారు. తెలుగు సాహిత్యలోకానికి రారాజుగా వెలుగొందారు. అంతేకాదు, రాజ్యసభసభ్యునిగానూ బాధ్యతలు స్వీకరించి ప్రజా సేవలోనూ తరించారు. ఆ కవిరాజు ఇక లేరు. ఈ నెల 12వ తేదీ ఉదయం 6గంటలకు హైదరాబాద్‌లోని తన స్వగృహంలో కనుమూసారు.

## చిన్నతనం నుంచీ సాహిత్యంపైనే ఆసక్తి :

1931 జులైన 29న కరీంనగర్‌జిల్లా సిరిసిల్ల తాలూకాలోని హన్మాజీపేట అనే కుగ్రామంలో డా.సినారె జన్మించారు. తల్లిదండ్రులు బుచ్చమ్మ-మల్లారెడ్డిగార్లు. సినారె పూర్తిపేరు సింగిరెడ్డి నారాయణరెడ్డి. వీరిది రైతు కుటుంబం. అయితే ఆయనకు వ్యవసాయంపై కాక, సాహితీసేద్యంపైనే మక్కువ ఎక్కువ. ఆ ఆసక్తితోనే సినారె సాహితీరంగంలోకి వచ్చారు. చిన్నతనం నుంచే పద్యాలు గాయాలు రాస్తూ సాహిత్యాభిలాషని పెంపొందించుకున్నారు. సినీరంగంలోకి వచ్చాక సిరా ఇంకిపోయే దాకా..ప్రజల హృదయాల్లో ఇంకిపోయే పాటలెన్నో రాశారు. చదువుకునే రోజుల్లోనే భాషపై పట్టు సాధించారు. ఉన్నత చదువులు చదువుకుని ఎం.ఏ పూర్తి చేసి అధ్యాపకవృత్తిలో ప్రవేశించారు. 1958-59లో నిజాం కళాశాలలో ఉపన్యాస కులుగా పనిచేశారు. 'ఆధునికాంధ్ర కవిత్వం- సంప్రదాయాలు, ప్రయోగాలు' అనే అంశంపై పరిశోధన చేసి 1962లో పిహెచ్‌డి పట్టా పొందారు. 1963లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ రీడర్‌గా చేరారు. 1976లో ఆచార్యునిగా పదోన్నతి పొందారు. 1981 వరకూ అదే పదవిలో కొనసాగారు. ఆయన రచించిన కర్పూరవసంతరాయలు, నాగార్జునసాగరం, మంటలూ-మానవుడు వంటి రచనలు ఆణిముత్యాలుగా భాసించాయి. ఆయన సుమారు 90కి పైగానే గ్రంథాలు రాశారంటే ఆయన సాహితీప్రజ్ఞ ఎంత ఘనమైనదో ఊహించ కోవచ్చు. దాదాపు డెబ్బై ఏళ్ళకు పైగానే కవితాప్రస్థానం ఆయనది. విశేషించి 'విశ్వంభర' కావ్యం విఖ్యాతమైన 'జ్ఞానపీఠ పురస్కారం' అందుకోవడం ఆయనకే కాదు..తెలుగుజాతికీ, తెలుగుభాషకు ఎనలేని గౌరవం. సాహిత్యానికి ఆయన చేసిన సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం 1977లో ప్రతిష్ఠాత్మకమైన పద్మశ్రీ పురస్కారాన్ని, 1992లో విశిష్టమైన పద్మభూషణ్ పురస్కారాలతో గౌరవించి ఘనంగా సత్కరించింది. అంతటి సాహితీయోధుడు.. మానవతా



వాది తెలుగునేలపై పుట్టడం తెలుగుజాతికే గర్వకారణం. విఖ్యాతకవిగా, కవి దిగ్గజంగా..ఆధునిక కవి సార్వభౌముడుగా, సాహితీ రారాజుగా తెలుగు భాషకు ఎనలేని సేవలందించిన ఆ సాహితీయోధుడు..మన పాటల రేడు..సినారె అస్తమయం తెలుగుజాతికి తీరని లోటు. ఆ లోటు మరెవరూ తీర్చలేనిది. ఒక్కమాటలో చెప్పాలంటే, తెలుగు సాహితీలోకాన ఆయనో మహోన్నతమైన హిమాలయశిఖరం. ఆయన మరణంతో తెలుగు సాహిత్య చరిత్రలో ఒక శకం ముగిసినట్లే. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాటలు, కవితలు మన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచేవుంటాయి. తెలుగు సాహితీ క్షేత్రంలో ఆయనో ప్రత్యేక గ్రంథం..ఆయన కవిత్వం ఏనాటికీ ఇగిరిపోని గంధం. ప్రత్యేకించి 'లాయర్' కుటుంబంతో డా.సినారెకి ఎంతో కాలం నుంచి మంచి అనుబంధం ఉంది.

ఏదేమైనా సినారె ఇక లేరనుకోవడాన్ని జీర్ణించుకోలేం. సినారె మరణానికి తీవ్ర సంతాపం తెలియజేస్తూ...ఆ మహనీయ సారస్వతమూర్తికి...తెలుగుజాతి సమున్నత కీర్తికి... మహోన్నత మానవతామూర్తికి... కవితాదీప్తికి..అశ్రునయనాలతో.... 'లాయర్' నివాళి!..

## పాటల రేడుగా... సాహితీ రారాజుగా...

సినీ గీతరచయితగా ఆయన అత్యద్భుతమైన ప్రతిభా పాటవాలతో రాణించారు. ఆయన పాటలెన్నో సూపర్‌హిట్ సాంగ్స్‌గా ప్రజల ప్రశంసలందుకున్నాయి. ఆయన రాసే పాటల్లో సహజత్వం, సామాజిక చైతన్యం మిళితమై వుంటాయి. అందుకే ఆయన ఏ రచన చేసినా, గీతం రాసినా అది ప్రజల మనసుల్లో హత్తుకుపోతుంటుంది. నటరత్న డా.ఎన్టీఆర్ దర్శకత్వంలోని 'గులేబకావళి కథ' చిత్రంలో 'నన్ను దోచుకుందు వటే వన్నెల దొరసాని'..అనే పాటతో తెలుగు సినీలోకంలో పాటల ప్రస్థానం ప్రారంభించి, వేలాది పాటలతో అశేష తెలుగు ప్రజానీకాన్ని మైమరపించి ప్రఖ్యాత గీత రచయితగా సినారె విఖ్యాతి చెందారు. ఆయన రచించిన ప్రేమగీతాలు, యుగళ గీతాలు..ఎన్నెన్నో పాటలు ప్రజలను ఉర్రూతలూగించాయి.ఆయనెన్నో స్ఫూర్తిదాయకమైన గీతాలను రచించి ప్రజల మనసులను ఇట్టే ఆకట్టుకున్నారు. 'చరణ కింకిణులు ఘల్లుఘల్లుమన..కరకంకణములు గలగల లాడగ..వినీలకచభర విలాసబంధుర తనూలతిక చంచలించిపోగా..ఆడవే మయూరీ!..నటనమాడవే మయూరీ'..వంటి సంస్కృత పదభూయిష్టమైన పాటలను సైతం ఎంతో హృద్యంగా..రసరమ్యంగా రచించి శ్రోతలను ఆకట్టుకున్నారు. పాటలతోనే పాటలకో లోకం సృష్టించారు. ఆ లోకంలో..ఆ గీతాల్లో పడి మైమరచిపోని వారుండరు. అంతేకాదు, పగలే వెన్నెల సృష్టించి, జగాన్నే ఊయలలూగించిన మధుర కవి డా. సి.నారాయణరెడ్డిగారు. ఆయన ఏ పాట రాసినా ఏపాటకాపాటే మధురం..ఆపాతమధురం. విశిష్టమైన, విలక్షణమైన సాహితీ రచనల సృష్టిలోనూ ఆయన ఉద్దండులనిపించుకున్నారు. ఎందరో కవిపండితుల మధ్య తనే కవి దిగ్గజమనిపించుకున్నాడు. ఎంతో ప్రఖ్యాతమైన 'జ్ఞానపీఠ్' అవార్డును సైతం సాధించి తెలుగుభాషకు ఎనలేని గుర్తింపును గౌరవాన్నీ తెచ్చిరు. అంతెందుకు, ఆయనలా తెలుగుభాషా వికాసం కోసం జీవితమంతా పరితపించిన కవి తెలుగుగడ్డపై మరొకరు లేరంటే అతిశయోక్తేమీ కాదు.

# 'దేశం'కు అగ్నిపరీక్ష!

(మొదటి పేజీ తరువాయి)

నంద్యాలలో గెలిచింది వైసిపి, నాగిరెడ్డి మాత్రం మరణించేరోజుకు తెలుగుదేశంలో ఉన్నాడు. మా పార్టీ గెలిచిన సీటును మేమెందుకు వదులుకుంటామంటూ జగన్ మొదట్లోనే పోటీకి సంకేతాలిచ్చాడు. ఇక మా పార్టీ నాయకుడు కాబట్టి వారి కుటుంబసభ్యులనే పోటీకి దించాలంటూ చంద్రబాబు భూమా నాగిరెడ్డి సోదరుడి కొడుకైన భూమా బ్రహ్మానందరెడ్డిని అభ్యర్థిగా ఖరారు చేశారు. 2014 ఎన్నికల్లో నంద్యాల నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేసి కొద్ది ఓట్ల తేడాతో పరాజయం పాలైన శిల్పా మోహన్‌రెడ్డి ఉపఎన్నికల్లో నంద్యాల సీటును ఆశించాడు. అయితే చంద్రబాబు భూమా కుటుంబానికే సీటు అని తేల్చడంతో, ఇక అక్కడ ఇమడలేక శిల్పామోహన్‌రెడ్డి ఈ నెల 14వ తేదీన వై.యస్.జగన్ సమక్షంలో వైసిపిలో చేరిపోయాడు. శిల్పా మోహన్‌రెడ్డి వైకాపాలో చేరడమే నంద్యాలలో తెలుగుదేశంకు అసలైన పరీక్ష. నంద్యాల నియోజకవర్గంలో బలమైన వర్గం, పరపతి కలిగిన నాయకుడు శిల్పామోహన్‌రెడ్డి, సొంతంగా ఓట్లున్నాయి. 2014 ఎన్నికల్లో కర్నూలు జిల్లాలో ఫ్యాన్ ప్రభంజనం పనిచేసినా, నంద్యాలలో మాత్రం శిల్పా చాలా గట్టిపోటీనిచ్చాడు. ఓపక్క వై.యస్. సానుభూతి, ఇంకోపక్క శోభా నాగిరెడ్డి మరణంతో వచ్చిన సానుభూతి... ఇంత అనుకూల వాతావరణం ఉన్నా కూడా 2014 ఎన్నికల్లో నంద్యాల నుండి భూమా నాగిరెడ్డి చచ్చీచెడి శిల్పా మోహన్‌రెడ్డి మీద కేవలం 2వేల చిల్లర ఓట్ల తేడాతో మాత్రమే గెలవగలిగాడు. అంటే ఇక్కడ శిల్పా వ్యక్తిగత బలం వై.యస్, శోభా నాగిరెడ్డిల సానుభూతిని ఢీకొట్టకలిగింది. తెలుగుదేశంలో ఉన్నప్పుడే అంతగా పోటీనిచ్చిన శిల్పా మోహన్‌రెడ్డికి వైసిపిలో ఇంకా ఇమేజ్ పెరుగుతుంది. వైసిపి హవా ప్రభుత్వ వ్యతిరేక ఓటు, శిల్పా వ్యక్తిగత ప్రతిష్ట అన్నీ కలిస్తే... ఇక్కడ శిల్పామోహన్‌రెడ్డిని ఢీకొనాలంటే కష్టమే! నంద్యాల ఉపఎన్నికల్లో శిల్పామోహన్‌రెడ్డి రూపంలో వైకాపాకు బలమైన అభ్యర్థి దొరికాడు. అధికార పార్టీ కాబట్టి తెలుగుదేశం గెలుపు కోసం ఇక్కడ శక్తియుక్తులన్నింటిని ధారపోయవచ్చు. ఈ ఉపఎన్నికల్లో గెలుపు అటు అధికార తెలుగుదేశంకు ఇటు ప్రతిపక్ష వైకాపాకు ప్రతిష్ఠాత్మకం. తెలుగుదేశం గెలిస్తే ఆ పార్టీ నుండి ఇక వలసలు ఉండవు. పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందన్న ఒక నమ్మకం ఏర్పడుతుంది. అదే ఓడిపోయి వైకాపా గెలిస్తే ఆ పార్టీ నుండి వైకాపాలోకి వలసలు మొదలవుతాయి. చంద్రబాబు నాయకత్వంపై నమ్మకం పోతుంది. మొత్తానికి నంద్యాల ఉపఎన్నిక ఫలితం ప్రభావం 2019 ఎన్నికలపై బలంగానే ఉంటుంది.

# పొత్తు కోసం ఎత్తులు


(మొదటి పేజీ తరువాయి)

వాజ్‌పేయి నాటి ఎన్డీఏ ప్రభుత్వంలో చంద్రబాబు చాలా బెట్టుగా ఉండేవాడు. బీజేపీ నాయకులే తన కాళ్ల దగ్గరకు రావాలన్నట్లుగా ఉండేవాడు. ఏమన్నా తేడా వస్తే, తనకేమన్నా విలువ తగ్గితే పెట్టె బేడా సర్దుకుని ఎన్డీఏ నుండి బయటకొచ్చేస్తానన్నట్లు బెదిరించేవాడు. బీజేపీ అంతర్గత పరిణామాలపై కూడా ఆయన గతంలో నోరు విప్పిన సందర్భాలున్నాయి. అయితే అప్పటికి, నేటి మోడీ కాలానికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కేంద్రంలోని బీజేపీని ఆయన బెదిరించడం కాదు కదా, బ్రతిమలాడి వారితో పొత్తును కొనసాగించాల్సిన స్థితిలో వున్నాడు. బీజేపీ ఎక్కడ తమతో తెగదెంపులు చేసుకుంటుందోనని భయపడుతున్నాడు. ఈమధ్య ఏపిలో బలపడాలంటూ ఢిల్లీ బీజేపీ నాయకులు ప్రకటనలు గుప్పించారు. దీనికి తగ్గట్లే పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా ఈమధ్య విజయవాడలో భారీ సభ పెట్టి మాట్లాడారు. తెలుగుదేశంతో తెగదెంపులు చేసుకుంటేగాని రాష్ట్రంలో బీజేపీ బలపడే పరిస్థితి లేదు. వీళ్లు బలం పెంచుకోవడానికి తమతో ఎక్కడ పొత్తు వదులుకుంటారోనని చంద్రబాబు భయం. వచ్చే ఎన్నికల్లో కూడా బీజేపీతోనే కలిసి పయనించాలని చంద్రబాబు ఆశ. దీనికి కారణం ప్రజల్లో మోడీ ఇమేజ్ పెరిగిందని నమ్మకం కలగడమే! మొన్న యూపీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయివుంటే చంద్రబాబు వాయిస్ ఇంకోరకంగా ఉండేది. బీజేపీతో తెగదెంపులకు సిద్ధంగానే ఉండేవాడు. కాని ఇప్పుడా పరిస్థితి లేదు. టీడీపీ, బీజేపీల మధ్య పొత్తు విచ్ఛిన్నం కాకుండా కాపాడేందుకు ఆయన తనకున్న అవకాశాలన్నింటిని వాడుకుంటున్నాడు.

మరోపక్క ప్రతిపక్ష వైకాపా కూడా కేంద్రంలో బీజేపీతో మైత్రికే మొగ్గుచూపుతుండడం విశేషం. వైసిపి కాంగ్రెస్‌లో నుండి వచ్చిన గుద్దముక్కే! అయితే కాంగ్రెస్ నుండి వేరుపడ్డ పార్టీలన్నీ కూడా గతంలో తిరిగి కాంగ్రెస్ గూటికే చేరాయి. కాని వైసిపి అధినేత జగన్ పరిస్థితి అది కాదు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీనే ఢీకొట్టాడు. ఆమె వ్యక్తిగత కక్ష కారణంగా జగన్ 16 నెలలు జైలులో వున్నాడు. ఇలాంటి పరాభవాన్ని ఎవరూ జీర్ణించుకోలేరు. ఇంత హింసించిన సోనియాగాంధీ వద్దకు అతను పోలేడు. అదీగాక జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ పతనమైతే జగన్ పంతం కూడా నెరవేరినట్లవుతుంది. అందుకనే జాతీయ రాజకీయాలలో తనకంటూ ఒక వేదిక కోసం జగన్ కాంగ్రెస్ వైపు కాకుండా బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నాడు.

చంద్రబాబు అయినా జగన్ అయినా బీజేపీ వైపు మొగ్గు చూపడానికి మరో బలమైన కారణం వుంది. ఇద్దరి మీద కేసులున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జగన్, ఓటు-నోటు కేసులో చంద్రబాబులు ఇరుక్కున్నారు. దీంతో కేంద్రం చేతిలో ఇద్దరూ బందీలుగా వున్నారు. ఈ కేసులుండబట్టే మోడీ, అమిత్‌షాల ద్వయం వీరితో ఆడుకుంటోంది. రేపు ఈ ఇద్దరిలో వాళ్లు ఎవరిని వాడుకుంటారో చూడాలి.

# అద్వానీ...



# కమలాపతి... అయ్యేనా రాష్ట్రపతి?

- త్వరలో తేలనున్న భవిత్యం
- బాబ్రీ చిక్కుముడి వీడితే రాష్ట్రపతి
- కేసు తేలకపోతే జీవితాంతం ఇక కమలాపతి

లాల్‌కిషన్ అద్వానీ... ఆయన లేకుంటే బీజేపీ లేదు. ఆయన రథయాత్ర చేయకుంటే బీజేపీకి మనుగడ లేదు, ఆయన సారథ్యం వహించకుంటే బీజేపీకి విజయప్రస్థానం లేదు. ఆయనే అండగా నిలవకపోయి వుంటే ఈరోజు ప్రధానమంత్రి పీఠంపై నరేంద్ర మోడీయే ఉండేవాడు కాదు. ఈరోజు దేశవ్యాప్తంగా బీజేపీ విస్తరిస్తుందన్నా, కేంద్రంలో తిరుగులేని శక్తిగా అవతరిస్తుందన్నా దాని క్రెడిట్ అంతా కూడా అద్వానీదే! ఆయన లేవనెత్తిన రామమందిరం అంశందే! బీజేపీని ఆయన నిలబెట్టాడు. ఆయన లేనిదే ఈరోజు బీజేపీ లేదు, ఉన్నా ఈ స్థాయిలో ఉండేది కాదు. ఆయన నిలబెట్టిన పార్టీలో అందరూ ఆయన భుజాల మీద నుండే పాదాలు పెట్టి ప్రధానులు, రాష్ట్రపతులు అవుతున్నారు. కాని, ఆయన మాత్రం ఆ పదవులను అందుకోలేకపోతున్నాడు. ఏ రామ జన్మభూమి – బాబ్రీ మసీదు వివాదమైతే ఈ దేశంలో భారతీయ జనతా పార్టీ ప్రాభవానికి పునాదిగా నిలిచిందో... అదే వివాదం అద్వానీ పదోన్నతికి ప్రతిబంధకంగా నిలిచింది.

1996, 1998, 1999... మూడు సార్లు కేంద్రంలో బీజేపీకి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశాలొచ్చాయి. మిత్ర పక్షాలన్నీ కూడా అతివాదిగా ముద్రవున్న అద్వానీ కాకుండా మితవాద ముద్ర వున్న వాజ్‌పేయినే ప్రధానిగా కోరుకున్నాయి. కాబట్టి ఆ మూడుసార్లు అవకాశం వాజ్‌పేయికి పోయింది. 2004, 2009 ఎన్నికల్లో బీజేపీ మట్టి కరిచింది. ఆ రెండు ఎన్నికల్లో ఏ ఒక్కసారి పార్టీ అధికారంలోకి వచ్చున్నా, అద్వానీయే ప్రధాని. కాని అదృష్టం, అవకాశం రెండూ కలసిరాలేదు.

2014 ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోడీ తెరమీదకొచ్చాడు. వాస్తవంగా ఆ ఎన్నికల్లో యూపిఏ మీద వున్న వ్యతిరేకత కొద్ది ప్రజలు బీజేపీ సంకీర్ణ కూటమికే అధికారం కట్టబెట్టుండేవాళ్ళు. మోడీగా ప్రదాని అభ్యర్థిగా ప్రచారం చేయకపోయి వున్నా బీజేపీ కూటమిదే అధికారం. ఇందులో సందేహం లేదు. కాకపోతే సీట్లు తగ్గేవంతే! మోడీ ఇమేజ్ వల్ల వూహించని విధంగా సీట్లు పెరిగాయి. అద్వానీ ప్రధాని కావడానికి వున్న చివరి అవకాశం 2014 ఎన్నికలే! మోడీ రూపంలో అక్కడా బ్రేకు పడింది.

దేశంలో అద్వానీ స్థాయికి సరితూగ గల పదవి ఇక రాష్ట్రపతి పదవే! అన్ని అర్హతలున్నా ప్రధాని కాలేకపోయాడాయన! కనీసం రాష్ట్రపతిగానైనా ఎన్నుకుని ఆ జాతీయ నాయకుడిని, రాజకీయ యోధుడిని గౌరవించుకోవాలని బీజేపీలోని ఆయన సానుభూతి పరులు భావించారు. అయితే బాబ్రీ మసీదు విధ్వంసం కేసు ఉరుములేని పిడుగులా పైన పడింది. రాష్ట్రపతి ఎన్నికకు టైం దగ్గర పడుతున్న కొద్దినెలల ముందే బాబ్రీ కేసు విషయంలో సిబిఐ ఆయనపై ఛార్జిషీట్ దాఖలుచేసింది. దీంతో రాష్ట్రపతి కావడానికి ఆయనకున్న దారులు మూసుకుపోయాయి. ప్రధాని నరేంద్రమోడీయే ఈ కేసును తిరగదోడాడని, గురువును ముంచిన, మించిన శిష్యుడనిపించుకున్నాడనే ఆరోపణలు వినవస్తున్నాయి. రాష్ట్రపతి ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకటించింది. జూలై 17న పోలింగ్, 20వ తేదీ కౌంటింగ్ వుంటుంది. ఈ నెల 14వ తేదీ నుండి 28వ తేదీలోపు నామినేషన్లు వేయవచ్చు. 30వ తేదీ నామినేషన్ల పత్రాల పరిశీలన జరుగుతుంది. జూలై 1వ తేదీ నామినేషన్ల ఉపసంహరించుకోవచ్చు.

ఇక ఎన్డీఏ కొద్దిరోజుల్లోనే తమ అభ్యర్థిని ప్రకటించవచ్చు. అద్భుతాలు జరిగితే తప్పితే రాష్ట్రపతి అభ్యర్థిగా అద్వానీకి దాదాపు అవకాశం లేనట్లే! ఎన్డీఏ తరపున రాష్ట్రపతి అభ్యర్థిగా జార్ఖండ్ గవర్నర్‌గా వున్న ద్రౌపతికుర్మ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఈమె గిరిజన మహిళ! బీజేపీలో కార్యకర్త స్థాయి నుండి ఎదిగిన నాయకురాలు. ఈమెను రాష్ట్రపతిగా ఎన్నుకుంటే గతంలో అబ్దుల్‌కలాంను రాష్ట్రపతిగా చేసి ఒక ముస్లింను రాష్ట్రపతిని చేసిన ఖ్యాతిని పొందినట్లే, ఒక గిరిజన మహిళను రాష్ట్రపతిని చేసామన్న పేరు కూడా బీజేపీ ఖాతాలో పడుతుంది. ఈమెను అభ్యర్థిగా ప్రకటిస్తే విపక్షాలు కూడా పోటీ అభ్యర్థిని పెట్టే ప్రయత్నాన్ని విరమించుకోవచ్చు. ఒకవేళ టైం కలిసొచ్చి అద్వానీని రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించినా ఎన్డీఏతర ప్రాంతీయ పార్టీలు కొన్ని ఆయనకు మద్దతుగా నిలిచే అవకాశాలున్నాయి.

- సమర్థతకు సముచిత స్థానం

# జిఎస్టీ జాతీయ కమిటీలో కృష్ణమోహన్‌రెడ్డి

- నెల్లూరు డి.సి కి అరుదైన గౌరవం



దేశవ్యాప్తంగా జూలై 1వ తేదీ నుండి వస్తు సేవల పన్ను(జిఎస్టీ)ని అమలు చేయడానికి కేంద్రప్రభుత్వం అన్ని రాష్ట్రాలను సమాయత్తం చేస్తోంది. జిఎస్టీ అమలుకు మార్గం సుగమం చేస్తూ, సంబంధిత వర్గాలను సిద్ధం చేసే దిశగా జిఎస్టీ కౌన్సిల్ దేశవ్యాప్తంగా రెండు కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ నెల 11వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన జిఎస్టీ కౌన్సిల్ సమావేశంలో జిఎస్టీ అమలు కమిటి, ప్రత్యేక వర్గాల కమిటీల పేరుతో రెండు కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక వర్గాల కమిటీలో వాణిజ్య పన్నుల శాఖ నెల్లూరు డివిజన్ ఉపకమిషనర్ ఎస్.ఇ.కృష్ణమోహన్‌రెడ్డిని మైనింగ్ రంగానికి సంబంధించి సభ్యులుగా నియమించారు. జిఎస్టీలో మైనింగ్‌కు చాలా ప్రాధాన్యత వుంది. భూగర్భ వనరులు, మైనింగ్ వ్యవస్థకు సంబంధించి వస్తు సేవల పన్ను విధింపు పై సంబంధిత వర్తక, వాణిజ్య వర్గాలు, డీలర్లు, వ్యాపార సంఘాల నాయకులలో అవగాహన కల్పించి అపోహలు తొలగించాల్సి వుంది. కొత్త పన్నుల విధానంలోకి వెళుతున్నప్పుడు మైనింగ్ వ్యాపారంలో వున్న వారి సాధక బాధకాలను కూడా ఓర్పుగా విని పరిష్కరించాల్సి వుంది. ఈ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తాడనే జిఎస్టీ ప్రత్యేకవర్గాల కమిటీలో మైనింగ్ బాధ్యతలను కృష్ణమోహన్‌రెడ్డికి అప్పగించారు. సమర్ధవంతమైన అధికారిగా కృష్ణమోహన్‌రెడ్డికి తమ శాఖలో చాలా మంచి పేరుంది. సబ్జక్ట్‌పై అవగాహన, కొత్త విధానాన్ని తగిన రీతిలో వ్యాపారవర్గాల్లోకి తీసుకెళ్ళి వారిని చైతన్యవంతుల్ని చేయగల ప్రతిభ వున్న ఆయనను ఈ కమిటీలో నియమించారు. కాగా, కృష్ణమోహన్‌రెడ్డి 'లాయర్'తో మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పన్నుల విధానాన్ని సులభతరం చేసేందుకు జిఎస్టీని అమలులోకి తెచ్చిందని, మైనింగ్ రంగానికి సంబంధించి ఎవరికి ఏ సందేహాలు వున్నా 9949994181 నెంబర్‌లో తనను సంప్రదించి సందేహాలు తీర్చుకోవచ్చని కోరారు. కేంద్ర ప్రభుత్వం పన్నుల విధానాన్ని సరళతరం చేసే ఉద్దేశ్యంతో చేపట్టిన జిఎస్టీ అమలులో భాగస్వామి అయి నందుకు కృష్ణమోహన్‌రెడ్డిని 'లాయర్' అభినందిస్తోంది.












Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com